జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
బుధవారం | 18 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 12

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- కొత్తగా 13,958 మందికి పెన్షన్లు మంజూరు.
- మహిళా సంఘాలకు రూ.20 లక్షల వరకు వడ్డీలేని రుణాలు
- రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



మేడిపల్లి నవంబర్ 17 ప్రజాజ్యోతి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మేడిపల్లి మండల కేంద్రంతో పాటు భీమారం మండలం మన్నెగూడెం గ్రామంలో

మిగతా 2 లో...

పిల్లల ఆరోగ్య, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



- అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- ప్రతి మంగళవారం పది నిమిషాల కార్యక్రమం నిర్వహణతో మెరుగైన సేవలు
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ముస్తాబాద్, నవంబర్ 17 (ప్రజాజ్యోతి): చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బాల్యం నుంచే తగిన పోషకాహారం అందించడంతో పాటు వారి అభివృద్ధిపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఆరేళ్లలోపు పిల్లలను ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రాలకు పంపించి, అక్కడ అందించే పోషకాహారం, విద్యా సంబంధిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పది నిమిషాల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల ఎత్తు, బరువు కొలిచే ప్రక్రియను పరిశీలించారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న సామ్, మామ్ పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో

మిగతా 2 లో...



అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

మంత్రి పొన్నం ప్రభాకర్

- చిగురుమామిడిలో 550 మందికి నూతన చేయూత పింఛన్ల పంపిణీ
- ఈ నెల 19 నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో పింఛన్ నగదు జమ
- త్వరలోనే ఇందిరమ్మ కుటుంబ బీమా, చీరల పంపిణీ ప్రారంభం

చిగురుమామిడి/నవంబర్ 17, ప్రజాజ్యోతి: ప్రజా పాలన ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని చిగురుమామిడి మండల కేంద్రం మహాలక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ఆయన అర్హులైన లబ్ధిదారులకు నూతన చేయూత పింఛన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రాష్ట్రవ్యాప్తంగా 4.68 లక్షల నూతన చేయూత పింఛన్లు మంజూరు చేశామని, చిగురుమామిడి మండలంలో ఇప్పటికే 6,700 పింఛన్లు ఉండగా తాజాగా మరో 550 మందికి కొత్త పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి నూతన పింఛన్ల నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని వెల్లడించారు. సరైన ఆధారాలు లేక గతంలో దరఖాస్తులు తిరస్కరణకు గురైన వారికి మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తామని, వృద్ధుల పింఛన్ల కోసం త్వరలోనే కొత్త దరఖాస్తులు స్వీకరిస్తామని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా

మిగతా 2 లో...

యాసంగిలో వరి సాగు చేస్తే రైతులకు నష్టమే!

- నీటి లభ్యత లేకపోవడంతో వరి సాగుకు అనుమతి లేదు
- ఒక ఎకరం వరి సాగు నీటితో నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయవచ్చు
- ఆరుతడి పంటల వైపు రైతులను మళ్లించాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 17, ప్రజాజ్యోతి: యాసంగి సీజన్‌లో జిల్లాలో వరి సాగు రైతులకు పూర్తి నష్టదాయకమని, ప్రస్తుత నీటి లభ్యత పరిస్థితుల్లో వరి సాగుకు అవకాశం లేదని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. భూగర్భ జలమట్టాలు తగ్గిపోవడంతో పాటు ఎస్ఆర్ఎస్పీలోనూ నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో సాగు నీరు విడుదల చేయడం సాధ్యం కాదని తెలిపారు. రైతులు వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటల వైపు మళ్లాలని సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో యాసంగి సాగు ప్రణాళికపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటుతున్నాయని, అందుబాటులో ఉన్న నీరు కేవలం తాగునీటి అవసరాలకే సరిపోయే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో

మిగతా 2 లో...

ఇందిరమ్మ భీమా పథకం నమోదును పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లాలో 2,83,453 కుటుంబాల నమోదు లక్ష్యం.. 481 ప్రత్యేక శిబిరాల ఏర్పాటు.
- అర్హులందరికీ బీమా ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలి – అదనపు కలెక్టర్ ఎన్. ప్రసూనాంబ



జగిత్యాల, నవంబర్ 17, ప్రజాజ్యోతి. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించి, నమోదు ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ అధికారులను ఆదేశించారు. పథకం అమలుకు సంబంధించి మంగళవారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల

మిగతా 2 లో...

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



(మొదటి పేజీ తరువాయి...)

తాజాగా మరో 2,000 ఇళ్లు కేటాయించామన్నారు. రాజకీయ వివక్ష లేకుండా గుడిసెల్లో నివసించే నిరుపేదలకు, ఆడపిల్లలు ఉన్న కుటుంబాలకు ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. అలాగే ఈ నెల 19న సీఎం రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటనలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు నాణ్యమైన 'ఇందిరమ్మ చీరల' పంపిణీని ప్రారంభిస్తారని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా భూమి ఉన్నా లేకపోయినా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల రక్షణ కల్పించే 'ఇందిరమ్మ కుటుంబ బీమా' పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని గుర్తు చేశారు. మహిళా సంఘాలకు రూ.79 వేల కోట్ల నిధులు కేటాయించడంతో పాటు వడ్డీ లేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామన్నారు. మండల సమాఖ్యల ద్వారా ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇప్పించడంతో పాటు, గ్రామాల్లో శుభకార్యాలకు ప్లాస్టిక్ నివారణకు ఉచితంగా స్టీల్ బ్యాంకులను ఏర్పాటు చేశామని వివరించారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం చిగురుమామిడి మండలాన్ని కరీంనగర్ మెడికల్ కాలేజీకి దత్తత ఇచ్చామని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణ కొనసాగుతోందని, ఎంఎంఆర్-3 పనులకు టెండర్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. భూగర్భ జలాల పెంపునకు ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు, 4-5 ఊటకుంటలు, పొలాల్లో ఫామ్ పాండ్స్ నిర్మించుకోవాలని, స్థానిక నర్సరీని ఉపయోగించుకుని రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపాలని సూచించారు. యువతను వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు ప్రతి గ్రామంలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టులు, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు చిన్న గ్రామాలకు రూ.లక్ష, పెద్ద గ్రామాలకు రూ.2 లక్షలు కేటాయిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందిస్తున్నామని అన్నారు. ఈ నెల 21న మండలంలోని దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందులో అర్హులకు కృత్రిమ అవయవాలు, ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు, ఊతకర్రలు, బెల్టులు, టాయిలెట్ చైర్లను ఉచితంగా అందజేస్తామని, అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, డీపీఓ జగదీశ్వర్, తహసిల్దార్ కనకయ్య, ఎంపీడీవో రామ్మోహన చారి, సింగిల్ విండో చైర్మన్ చిట్టి మల్ల రవీందర్, స్థానిక సర్పంచ్ ఆకవరం భవాని, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు రాజ్ కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి...)

నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ల పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం కొండాపూర్ గ్రామంలో పరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జగిత్యాల జిల్లాలోని 25 మండలాల పరిధిలో 2,13,448 మంది లబ్ధిదారులకు ప్రతినెలా పెన్షన్లు అందుతున్నాయని, కొత్తగా 13,958 పెన్షన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రతినెలా రూ.49 కోట్లకు పైగా పెన్షన్ల రూపంలో పంపిణీ చేస్తున్నామన్నారు. వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు, బోదకాలు, దయాలసిస్, ఎయిడ్స్ బాధితులకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. చేనేత కార్మికులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలోని 13 గ్రామాల్లో 281 మందికి ప్రతినెలా సుమారు రూ.51 లక్షల పెన్షన్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళా సంఘాలకు రూ.20 లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, శ్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.67 వేల కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు వివరించారు. అలాగే అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, రైతు కుటుంబాలకు భరోసా కల్పించేలా రైతు మరణించిన సందర్భంలో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. పేదల సంక్షేమం, మహిళా సాధికారత, రైతులు, చేనేత కార్మికుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ భీమా పథకం నమోదును పకడ్బందీగా చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి...)

అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల గణన (SEEPAC) సర్వే ఆధారంగా జిల్లాలోని 20 మండలాలు, 5 మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 2,83,453 కుటుంబాలను నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో 385 గ్రామ పంచాయతీ కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో 96 కేంద్రాలు కలిపి మొత్తం 481 ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కుటుంబానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. బీమా పొందిన వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే నామినీకి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు. ఆహార భద్రత కార్డు ఉన్నవారితో పాటు, రేషన్ కార్డు లేని అర్హులు కూడా ఆధార్ ఆధారంగా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇతర జిల్లాలకు చెందిన రేషన్ కార్డుదారులు సైతం సమీపంలోని ప్రత్యేక శిబిరాల్లో వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. నామినీగా 18 సంవత్సరాలు నిండిన కుటుంబ సభ్యుడి వివరాలను నమోదు చేయాలని, కుటుంబంలోని పిల్లలు మైనర్లుగా ఉన్న సందర్భంలో అపాయింటీ వివరాలను తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. ప్రతి నమోదు కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌తో పాటు పంచాయతీ కార్యదర్శి లేదా వార్డు అధికారి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సమాచారం అందించేందుకు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయడంతో పాటు, వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం కూర్చునే వసతి, తాగునీరు, విద్యుత్ బ్యాకప్ కల్పించాలని స్పష్టం చేశారు. నమోదు ప్రక్రియ పురోగతిని ప్రతిరోజూ సమీక్షిస్తామని, మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో డప్పు చాటింపు ద్వారా, పట్టణ ప్రాంతాల్లో కేబుల్ నెట్‌వర్క్ ద్వారా ప్రజలకు పథకంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. నవంబర్ 19న జిల్లాలోని ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, అదే రోజు కనీసం 5 నుంచి 6 బీమా సభ్యత్వాల నమోదు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా రక్షణ అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నిర్ణీత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సీపీఓ సత్యం గౌడ్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు అధికారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్య, అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

(మొదటి పేజీ తరువాయి...)

ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించి, పిల్లలకు అందిస్తున్న వైద్య సేవల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లల పెరుగుదల పర్యవేక్షణ కార్డులను ఆవిష్కరించారు.

ప్రాథమిక పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

అనంతరం సమీపంలోని ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతన యూనిఫాంలు ధరించిన విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. గణితం, ఇతర పాఠ్యాంశాలకు సంబంధించి ప్రశ్నలు అడిగి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు పోషణ మాసం ప్రాముఖ్యతను వివరించారు.

ప్రతి మంగళవారం పది నిమిషాల కార్యక్రమం

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి మంగళవారం పది నిమిషాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో సేవలు, వసతులను మెరుగుపరచడం, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, బాలల హక్కుల పరిరక్షణ, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. ఆరేళ్లలోపు పిల్లలను తల్లిదండ్రులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని, వారి ఎత్తు, బరువును ఎప్పటికప్పుడు నమోదు చేయించాలని తెలిపారు. పిల్లల ఎదుగుదలకు అనుగుణంగా అవసరమైన పోషకాహారం అందేలా చూడాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లడం ద్వారా పిల్లలకు పౌష్టికాహారంతో పాటు ఆటలు, పాటలు, బొమ్మల ద్వారా ప్రాథమిక విద్యాబోధన అందుతుందని వివరించారు. పిల్లల జీవితంలో మొదటి వెయ్యి రోజుల దశ అత్యంత కీలకమని, ఈ సమయంలో సరైన పోషకాహారం అందించడం ద్వారా ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పునాది పడుతుందని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే ఆహారంతో పాటు ఇంటి వద్ద కూడా పిల్లలకు సమతుల ఆహారం అందించాలని సూచించారు. త్వరలో రక్తహీనత రహిత కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గ్రామ సర్పంచులు సైతం అంగన్వాడీ కేంద్రాలను తరచూ సందర్శించి, సామ్, మామ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారికి అవసరమైన పోషకాహారం అందేలా చూడాలని సూచించారు.



మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్త పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. గర్భిణులు, బాలింతలు, ఇతర మహిళలు తమ ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, నువ్వులు, బెల్లం, మునగ ఆకులు, మునగకాయలు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తప్పనిసరిగా చేర్చుకోవాలని సూచించారు.

వేములవాడ ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య సేవలు

పిల్లల్లో ఎదుగుదల లోపాలు, వినికిడి, మాట సంబంధిత సమస్యలు, మానసిక వికాసలోపాలు, నడవలేకపోవడం, పుట్టుకతో వచ్చే లోపాలు, మెదడుకు సంబంధించిన సమస్యలు, రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించడం ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గుర్తించిన ఇలాంటి పిల్లలకు వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించి సమస్యలను నిర్ధారిస్తారని వివరించారు. జాతీయ బాలల ఆరోగ్య కార్యక్రమం వాహనం ద్వారా పిల్లలను వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని జిల్లా ప్రారంభ జోక్యకేంద్రానికి తరలించి అవసరమైన వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. అవసరమైన వారికి కరీంనగర్‌లోని పోషక పునరావాస కేంద్రంలో, మరింత మెరుగైన వైద్య చికిత్స అవసరమైన పిల్లలకు హైదరాబాద్‌లో ఉన్నత వైద్య సేవలు అందించే ఏర్పాట్లు ఉన్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అరుట్ల మహేష్ రెడ్డి, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి నిర్మల, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో లచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో వరి సాగు చేస్తే రైతులకు నష్టమే!

(మొదటి పేజీ తరువాయి...)

విద్యుత్ సరఫరాలోనూ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ పరిస్థితులను రైతులకు వివరించి వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మొక్కజొన్న సాగును ప్రోత్సహించాలని, ఒక ఎకరం వరి సాగుకు వినియోగించే నీటితో నాలుగు ఎకరాల మొక్కజొన్న సాగు చేయవచ్చని వివరించారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసేలా రైతులను చైతన్యపరచాలని సూచించారు. ఆరుతడి పంటలకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రైతులు ఏయే పంటలు సాగు చేస్తున్నారనే వివరాలను సేకరించి, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని స్పష్టం చేశారు. యాసంగి సాగు ప్రణాళికను పకడ్బందీగా అమలు చేస్తూ రైతులకు నష్టం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రసాద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ హుదావుడికి దూరంగా

- కార్యకర్తలతో మమేకమై ఒకే టేబుల్‌పై అల్పాహారం
- పదవి కంటే ప్రజలతో అనుబంధానికే ప్రాధాన్యం
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నిరాడంబర వ్యవహారశైలి





ఎండపల్లి, నవంబర్ 17 (ప్రజాజ్యోతి): మంత్రి పదవి. అధికారిక హోదా.. ప్రత్యేక మర్యాదలు.. ప్రోటోకాల్ ఏర్పాట్లు. ఇవేవీ పట్టించుకోకుండా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సాధారణ వ్యక్తిలా వ్యవహరించారు. మండలంలోని రాజారాంపల్లిలో పార్టీ మినీ కార్యాలయం సమీపంలో పల్లెటూరు కేఫ్‌కు వెళ్లిన ఆయన, కార్యకర్తలతో కలిసి ఒకే టేబుల్‌పై కూర్చొని అల్పాహారం చేశారు. మంత్రి హోదాకు తగిన ప్రత్యేక ఏర్పాటాలకు దూరంగా కార్యకర్తలతో కలిసిమెలిసి గడపడం ఆయన నిరాడంబర వ్యవహారశైలిని ప్రతిబింబించింది. రాజకీయాల్లో పదవులు నాయకులకు గుర్తింపు నిస్తే.. కార్యకర్తలతో అనుబంధం నాయకత్వానికి బలాన్నిస్తుంది. ఎన్నికలైనా, ప్రజా కార్యక్రమాలైనా క్షేత్రస్థాయిలో పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర కీలకం. అందుకే అధికార హోదాలో ఉన్నప్పటికీ కార్యకర్తలకు అందుబాటులో ఉండటం, వారితో ఆత్మీయంగా మెలగడం ద్వారా ప్రజలతో తనకున్న అనుబంధానికి మంత్రి ప్రాధాన్యమిచ్చారు. పదవులు మారినా ప్రజలతో సంబంధాలు, కార్యకర్తలతో అనుబంధమే రాజకీయ ప్రస్థానంలో కీలకమనే భావన ఆయన వ్యవహారశైలిలో కనిపించింది.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు: ఆది శ్రీనివాస్



కథలాపూర్, నవంబర్ 17(ప్రజాజ్యోతి): పేదల సంక్షేమం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కథలాపూర్ మండల కేంద్రంలోని ఎస్ఎంఎస్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 554 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు, 32 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణ మాఫీ, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలు పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెడుతోందని తెలిపారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.250 కోట్లతో కార్యాచరణ చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు, తదితరులు మహిళలు పాల్గొన్నారు.

కట్కం పెంటయ్య కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



భీమారం, నవంబర్ 17(ప్రజాజ్యోతి): భీమారం మండలం మన్నెగూడెం గ్రామానికి చెందిన కట్కం పెంటయ్య ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వారి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పెంటయ్య మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

జగిత్యాలలో ఈ నెల 20న ప్రైవేట్ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు

- మహిళలకు అసెంబ్లీ హెల్పర్స్, వేర్‌హౌస్ ఆపరేటర్ పోస్టులు.. నెలకు రూ.17,288 వేతనం

జగిత్యాల, నవంబర్ 17, ప్రజా జ్యోతి జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 20వ తేదీన జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి బి. సత్యమ్మ తెలిపారు. సాయి ఆద్యంత్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీలో ఖాళీగా ఉన్న ఇయర్ బర్డ్ అసెంబ్లీ హెల్పర్స్, వేర్‌హౌస్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన, ఫెయిల్ అయిన వారితో పాటు ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా తదితర విద్యార్హతలు కలిగిన మహిళా అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 సంవత్సరాలు పైబడి ఉండాలి. ఎంపికైన అభ్యర్థులు రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లోని ఇయర్ బర్డ్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. నెలకు రూ.17,288 వేతనంతో పాటు రూ.2,000 వసతి భత్యం, రూ.1,500 హాజరు బోనస్ అందజేయనున్నారు. అదనంగా ఉచిత భోజనం, రవాణా సౌకర్యం కల్పించనున్నారు. రోజుకు 8 గంటల పని సమయం, మూడు షిఫ్టుల్లో విధులు ఉంటాయని వెల్లడించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 20వ తేదీన ఉదయం 10:30 గంటలకు అవసరమైన విద్యార్హత ధ్రువపత్రాలు, కుల ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. ఇంటర్వ్యూలు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, జిల్లా కలెక్టర్ భవన సముదాయం, రెండో అంతస్తు, గది నంబర్ 217లో నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి బి. సత్యమ్మ తెలిపారు. నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై సర్పంచులకు అవగాహన

బీర్ పూర్, నవంబర్ 17 (ప్రజా జ్యోతి): బీర్ పూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం మండల స్థాయి సర్పంచులకు 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం'పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి రామచందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పథకం యొక్క విధివిధానాలు, లబ్ధిదారులకు కలిగే ప్రయోజనాలపై సర్పంచులకు పూర్తిస్థాయిలో వివరించారు. ఈ సమావేశంలో బీర్ పూర్ ఎంపీడీఓ, తహసీల్దార్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

›› నేడు చేయూత కొత్త పింఛన్ల మంజూరు ఉత్తర్వుల పంపిణీ

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద చేయూత కొత్త పింఛన్ల మంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీర్ పూర్ ఎంపీడీఓ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన ఈ పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.



ఖరీఫ్ ధాన్యం కొనుగోలు పై అధికారులతో కలెక్టర్ బి. సత్యప్రసాద్ సమీక్ష





జగిత్యాల, నవంబర్ 17, ప్రజాజ్యోతి ఖరీఫ్ (వానాకాలం) ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లాలో ప్రతిపాదించిన అన్ని కొనుగోలు కేంద్రాలలో పూర్తిస్థాయిలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ, వానాకాలం పంట సీజన్‌లో జిల్లావ్యాప్తంగా మొత్తం 438 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. రైతులు FAQ ప్రమాణాల మేరకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చిన వెంటనే కొనుగోలు చేసేలా అధికారులు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 30 శాతం పంట కోతలు పూర్తయ్యాయని, ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు మద్దతు ధర కంటే అధిక ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యంలో తేమ శాతం ఎఫ్.ఏ.క్యూ. నిబంధనల పరిధిలో ఉన్నట్లయితే కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అవసరమైన సందర్భాల్లో గోదాములో భద్రపరిచేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ధాన్యాన్ని గోదాములకు తరలించేసమయంలో తేమ శాతం విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకు వినియోగించే వాహనాల కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు జీపీఎస్ ట్రాకింగ్ పరికరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

›› ప్రైవేటు కొనుగోళ్ల పై రైతులకు స్వేచ్ఛ కల్పించాలి

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం జిల్లాలో పండించిన ధాన్యంను ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చినప్పుడు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రైవేటు మార్కెట్‌లో రైతులకు మంచి ధర లభిస్తున్నప్పుడు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని రైతులపై ఎలాంటి ఒత్తిడి చేయకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు తమ పంటను ఎక్కడ విక్రయించుకోవాలనే విషయంలో పూర్తి స్వేచ్ఛ ఉండాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ప్రసూనాంబ, సివిల్ సప్లై అధికారులు, DAO, CPO, ట్రాన్స్‌పోర్ట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలి

- మున్సిపల్ కమిషనర్‌కు బీజేవైఎం నాయకుల వినతి

కోరుట్ల రూరల్, నవంబర్ 17(ప్రజా జ్యోతి) పట్టణంలోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించి ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని కోరుతూ భారతీయ జనతా యువమోర్చా బీజేవైఎం కోరుట్ల పట్టణ అధ్యక్షుడు దమ్మ సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత నెలకొని ప్రజారోగ్యానికి ఇబ్బందులు కలిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, పట్టణంలో నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు దమ్మ సంతోష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తైరాల ప్రశాంత్, కోశాధికారి మిట్టపల్లి వెంకట సాయి, ఉపాధ్యక్షులు వాసం లోకేష్, కుక్కల బలరాం, అల్లే రాజేందర్, కార్యదర్శులు గుద్దేటి మనోజ్, గోదా శ్రీకాంత్, సామల్ల సాయి, జిల్లా మీడియా కో-కన్వీనర్ దామ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



నేడు నూతన పెన్షన్ల ప్రాసీడింగ్స్ పంపిణీ



కొడిమ్యాల, నవంబరు 17 (ప్రజా జ్యోతి): మండలంలో కొత్తగా 511 మందికి చేయూత పెన్షన్లు మంజూరు కాగా, బుధవారం మ ధ్యాహ్నం 12 గంటలకు వెంకటాయపల్లిలోని ఎల్‌కే గార్డెన్స్‌లో ఎ మ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదుగా లబ్ధిదారులకు మం జూరు పత్రాలు అందజేయనున్నట్లు ఎంపీడీఓ స్వరూప ఒక ప్రకటనలో తెలి పారు.మంజూరైన పింఛన్లలో వితంతు వులు 257 మంది, దివ్యాంగులు 109 మంది, గీత కార్మికులు 86 మంది, ఒంటరి మహిళలు 54 మంది, చేనేత కార్మి కులు ఐదుగురికి పెన్షన్లు మంజూరయ్యాయని, మొత్తంగా 511 మంది లబ్ధిదా రులకు ప్రొసీడింగ్స్ అందజేయనున్నట్లు తెలిపారు.లబ్ధిదారులు నిర్ణీత సమ యానికి కార్యక్రమానికి హాజరుకావాలని ఎంపీడీఓ సూచించారు.

ట్రాక్టర్ ప్రమాదంలో మహిళకు గాయాలు

► 108 సిబ్బంది సత్వర స్పందన!



బీర్ పూర్, నవంబర్ 17 (ప్రజా జ్యోతి) :బీర్ పూర్ మండలంలోని తుంగూర్ గ్రా మానికి చెందిన గట్ల నర్సవ్వ ట్రాక్ట ర్ ప్ర మాదంలో గాయపడ్డారు. సమాచారం అందుకున్న ధర్మపురి 108 సి బ్బంది ఈఎంటీ అనిల్, పైలట్ సంపత్ వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరు గైన వైద్యం కోసం ఆమెను జగిత్యాల ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బందిని స్థానికులు అభినందించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

సాదర్ యాదవ కమిటీ మండల అధ్యక్షుడు బాకం సాయికి ఘన సన్మానం



సుల్తానాబాద్, నవంబర్ 17(ప్రజా జ్యోతి) సుల్తానాబాద్ మండల సాదర్ యాదవ కమిటీ అధ్యక్షుడిగా ఏకగ్రీవం గా ఎన్నికైన 6వ వార్డు కౌన్సిలర్ బాకం సాయి కిరణ్ యాదవ్‌కు పలు వురు ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు.అనం తరం వారు మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధిగా ఇప్పటికే పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రజల మన్ననలు పొందుతున్న సాయి కిరణ్ యాదవ్‌కు నూతన బాధ్యతలు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆ కాంక్షించారు. తన నాయకత్వంలో సాదర్ యాదవ కమిటీ మరింత అభివృద్ధి చెందడంతో పాటు సమాజ సేవలో ముందుండాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక మంలో ఆరపెల్లి సుహాన్ రాజ్, మామిడిపల్లి శ్రీకాంత్, గోదల సునీల్ రెడ్డి, శ్రీని వాస్ రెడ్డి, ఆరపెల్లి హేమన్ రాజ్, ఆరపెల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయాన్ని దర్శించుకున్న ప్రముఖులు



ఎల్లారెడ్డిపేట నవంబర్ 17(ప్రజా జ్యోతి) ఎల్లారె డ్డిపేట మండల కేంద్రం లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రతిష్ట చేశారు.. ఈ సందర్భంగా గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్ రెడ్డి, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు శ్యామంతుల అనిల్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు మహాదేవ్, గ్రామ పంచాయతీ కంప్యూటర్ ఆప రేటర్ కటకం రామచంద్రం, జర్నలిస్టు పెంటం శ్రీనివాస్ తదితరులు హాజరై ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండ రమేష్‌గౌడ్ రూ.5116 నగదును గౌడ సంఘం సభ్యులు పందిర్ల లింగం గౌడ్‌కు కానుకగా అందించారు. పాల్గొన్న వారికి గౌడ సంఘం సభ్యులు ఆత్మీ యంగా కండువాలు కప్పి ఆశీర్వచనం ఇచ్చారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ఇందిరమ్మ రాజ్య లక్ష్యం

- పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్





భీమారం, నవంబర్ 17ప్రజాజ్యోతి: పేదల సంక్షేమం, బలహీన వర్గాల అ భ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేముల వాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సం క్షేమ పథకాల ఫలాలు అందించి ఆర్థిక భరోసా కల్పించడమే ఇందిరమ్మ రా జ్య లక్ష్యమని స్పష్టం చేశారు. మంగళ వారం భీమారం మండలం మన్నెగూ డెం గ్రామంలో నూతనంగా మంజూ రైన చేయూత పింఛన్ల మంజూరు ప త్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మా ట్లాడుతూ వితంతువులు, ఒంటరి మ హిళలు, గీత కార్మికులు, చేనేత కార్మి కులు, బోధకాలు, డయాలసిస్, ఎయి డ్స్ బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. జిల్లాలోని 25 మండలాల పరిధిలో 2,13,448 మం ది లబ్ధిదారులకు ప్రతినెలా పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా 13, 958 పింఛన్లు మంజూరు చేసి దీర్ఘకా లంగా ఎదురుచూస్తున్న నిరుపేదలకు ఊరట కల్పించామన్నారు. ప్రతినెలా రూ.49 కోట్లకు పైగా పింఛన్ల రూపం లో పంపిణీ చేస్తూ పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని వివరిం చారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంద ని, 13 గ్రామాల్లో 281 మంది చేనేత కార్మికులకు ప్రతినెలా సుమారు రూ. 51 లక్షల మేర పింఛన్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి చే నేత కార్మికుడికి పింఛన్ అందేలా చర్య లు తీసుకుంటున్నామని తెలిపారు. మ హిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ మ హిళా సంఘాలకు రూ.20 లక్షల వర కు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని చెప్పారు. శ్రీనిధి, బ్యాంకు లింకేజీ ద్వా రా రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘా లకు సుమారు రూ.67 వేల కోట్ల రుణా లు అందించినట్లు వెల్లడించారు. మ హిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం సహకరిస్తోం దన్నారు. రైతు కుటుంబాలకు భరోసా కల్పించే దిశగా బీమా సౌకర్యం లేని రైతులు మరణించిన సందర్భంలోనూ రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలి స్తోందని తెలిపారు. రాష్ట్రంలోని అర్హులైన పేద కుటుంబాలకు ఇంది రమ్మ ఇళ్ల పథకం ద్వారా రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తూ ఇళ్ల నిర్మాణాన్ని దశలవారీగా చేపడుతు న్నామని పేర్కొన్నారు. పేదలు, బల హీన వర్గాలు ఆత్మగౌరవంతో జీవిం చేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఒకవైపు పేద లకు సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా కల్పిస్తూ, మరోవైపు మహిళా సాధికారత, రైతు సంక్షేమం, చేనేత కార్మికుల అభ్యున్నతి, నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.ఇట్టి కార్యక్రమం లో జిల్లా గ్రామీణ అభి వృద్ధి శాఖ అధికారి రఘువరను తహసీ ల్దార్ వసంత మండల సర్పంచ్ లు మండల పంచాయతీ కార్యాదర్శులు కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాంగ్రెస్ కార్యకర్తలు పెన్షన్ దారులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విరిగిపడే స్థితిలో విద్యుత్ స్తంభం

- పలుమార్లు చెప్పినా పట్టించుకోని వైనం







కొడిమ్యాల, నవంబరు 17 (ప్రజాజ్యోతి): ప్రమాదం కళ్లముందే కనిపిస్తున్నా విద్యుత్ శాఖ అధికారుల్లో చలనం కనిపించడం లేదు.కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామానికి చెందిన నోముల రాజిరెడ్డి వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసిన ఇనుప విద్యుత్ స్తంభం అడుగుభాగం పూర్తిగా తుప్పు పట్టి ఎప్పుడు విరిగి పడుతుందో తెలియని దుస్థితి నెలకొంది. స్తంభం పరిస్థితిపై పలుమార్లు సంబం ధిత లైన్‌మెన్, అధికారులకు విన్నవించినా పట్టించుకున్నదాఖలాలు లేవని రాజి రెడ్డి అనే రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం వరి కోతలు పూర్తికావడంతో కొత్త స్తంభం ఏర్పాటు చేసేందుకు అనువైన సమయం ఉందని రైతులు చెబుతు న్నారు. వ్యవసాయ పనులు ముమ్మరమైతే స్తంభం మార్పునకు ఇబ్బందులు ఎదు రవుతాయని పేర్కొంటున్నారు. ప్రమాదం జరిగాక హడావుడి చేసే బదులు ముం దుగానే స్పందించాల్సిన బాధ్యత అధికారులపై లేదా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తుప్పు పట్టిన స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ నేతల ముందస్తు అరెస్టు



సుల్తానాబాద్, నవంబర్ 17:(ప్రజా జ్యోతి) భారత్ సమ్మిట్‌లో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా, దేశానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ చేపట్టనున్న నిరసన కార్య క్రమానికి ముందే సుల్తానాబాద్ మండల, పట్టణ బీజేపీ నాయకులను పోలీ సులు ముందస్తుగా అరెస్టు చేశారు.బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేసి నిర సన కార్యక్రమం చేపట్టాలని పార్టీ నాయకులు నిర్ణయించారు. ఈ కార్యక్రమం నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టి బీజేపీ సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజుతో పాటు పలువురు పార్టీ నాయకులను అదుపులోకి తీసుకుని సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును అడ్డుకుంటూ ముందస్తు అరెస్టులకు పాల్పడటం అప్రజాస్వా మికమని విమర్శించారు. దేశ గౌరవం, సమగ్రతకు భంగం కలిగించే వ్యాఖ్య లను తమ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు. ప్రజాస్వా మ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని, అలాంటి హక్కులను పోలీసులు అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు.ఈ ముందస్తు అరెస్టుల్లో బీజేపీ నాయకులు వేగోళం శ్రీనివాస్ గౌడ్, కొల్లూరి సంతోష్‌కుమార్, చిట్టవేణి సదయ్య, ఓజ్జా సతీష్, మారం రమేష్, ఈర్ల ప్రశాంత్, మ్యాదరవేణి రాకేష్ తది తరులు ఉన్నారు.

ఫలించిన భీమ సంతోష్ కృషి మల్లన్నపేటకు నూతన సింగిల్ విండో మంజూరు

- మల్లన్నపేట లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల
- ప్రభుత్వ నిర్ణయంపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు గ్రామస్తుల కృతజ్ఞతలు



గొల్లపల్లి నవంబర్ 17 ప్రజాజ్యోతి గొల్లపల్లి మండలంలోని మల్లన్నపేట గ్రామంలో నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో) ఏర్పాటుకు మార్గం సుగమమైంది. గ్రామంలో సింగిల్ విండో ఏర్పాటు చేయాలని భీమ సంతోష్ చేసిన ప్రయత్నాలు ఫలించాయి.జిల్లాలో 12 నూతన సింగిల్ విండోలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో లో మల్లన్నపేట గ్రామానికి చోటు లభించింది.రైతులకు సహకార సంఘాల ద్వారా అందించే ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన సింగిల్ విండోల ఏర్పాటుకు చర్యలు చేపట్టాయి.ఇందులో భాగంగా గొల్లపల్లి మండలంలో ఒక నూతన సింగిల్ విండోను ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో మండలంలోని పలు గ్రామాల నాయకులు తమ గ్రామాల్లో ఏర్పాటు చేయాలంటూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారు ఈ క్రమంలో మల్లన్నపేట గ్రామంలో సింగిల్ విండో ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల ఉన్న ఎనిమిది గ్రామాల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని భీమ సంతోష్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం ఉండటంతో ఈ ప్రాంతానికి ఆధ్యాత్మిక ప్రాధాన్యత కూడా ఉందని వివరించారు.రైతులకు రవాణా పరంగా సౌలభ్యం కలగడంతో పాటు, తక్కువ దూరంలోనే సహకార సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రతిపాదించారు.ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి సింగిల్ విండో ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపారు. మంత్రి సానుకూలంగా స్పందించి, మల్లన్నపేటలో సహకార సంఘం ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించడంతో పాటు, రాష్ట్ర సహకార శాఖకు ప్రతిపాదనలు పంపించడంలో సహకరించారు .ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో లో మల్లన్నపేటకు చోటు దక్కడంతో గ్రామస్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గ్రామంలో నూతన సింగిల్ విండో ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సింగిల్ విండో ఏర్పాటు తో మల్లన్నపేటతో పాటు పరిసర గ్రామాల రైతులకు వ్యవసాయ రుణాలు, ఎరువులు, విత్తనాలు తదితర సహకార సేవలు మరింత చేరువయ్యే అవకాశం ఉంది.

ముస్తాబాద్ మండలంలో 625 మందికి చేయూత పెన్షన్లు మంజూరు

- అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం
- ఈ నెల 19వ తేదీ నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్





ముస్తాబాద్, నవంబర్ 17 (ప్రజా జ్యోతి):ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.ఇందులో భాగంగా ముస్తాబాద్ మండలంలోని 625 మంది నూతన లబ్ధిదారులకు చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆమె పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. చేయూత పెన్షన్ల కోసం ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించి, అర్హుల ఎంపిక కోసం సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో విచారణ చేయించినట్లు తెలిపారు. విచారణలో అర్హులుగా గుర్తించిన వారికి పెన్షన్ మంజూరు పత్రాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీ వరకు అర్హులందరికీ మంజూరు పత్రాల పంపిణీ పూర్తి చేస్తామని, ఈ నెల 19వ తేదీ నుంచి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పెన్షన్ నగదు జమ అవుతుందని వెల్లడించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా మొత్తం 8,209 మందికి నూతనంగా చేయూత పెన్షన్లు మంజూరు కాగా, అందులో ముస్తాబాద్ మండలానికి చెందిన 625 మంది లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే జిల్లాలో ఇప్పటివరకు సుమారు 4 వేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను కూడా లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల విలువైన జీవిత బీమా వర్తిస్తుందని వెల్లడించారు. ఈ పథకానికి సంబంధించి జిల్లాలోని అన్ని గ్రామాలతో పాటు మున్సిపల్ వార్డుల్లో నెల రోజులపాటు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఇందిరా మహిళా శక్తి చీరలను కూడా మహిళలకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. అర్హులైన పేదకుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అరుట్ల మహేష్ రెడ్డి, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి నిర్మల, తహసీల్దార్, ఎంపీడీవో లచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

వరిధాన్య కొనుగోలు కేంద్రం ప్రారంభం

- కొనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లయ్య



కోనరావుపేట, నవంబర్. 17(ప్రజాజ్యోతి)కొనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో కొలనూరు సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని కొనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య,కొలనూర్ సింగిల్ విండో చైర్మన్ బొమ్మెన భాస్కర్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంటెల్లి నాగరాజు , జిల్లా కార్యదర్శి షేక్ ఫిరోజ్ పాషా, మండల అధ్యక్షులు మానుక సత్యం, సర్పంచుల ఫోరం అధ్యక్షులు బోయిని దేవరాజు, ఏఎంసీ డైరెక్టర్ లు నాయిని ప్రభాకర్ రెడ్డి, వెంగలి వెంకన్న, సింగిల్ విండో డైరెక్టర్లు ఉప్పుల గంగయ్య, నిరటి సంజీవ్, సుంకరి రెడ్డి, మైపాల్ రెడ్డి, నూగురి గణేష్, సల్ల కార్తీక్, ఐదరి శ్రీనివాస్, ఉప సర్పంచ్ శ్రీరామోజు సాయి, బొర్ర రవీందర్, వార్డు సభ్యులు బుర్ర రమేష్, ఎర్రవెల్లి విజయ్, బాధవేణి కనక, సిద్ధిరాములు, వంగాల ప్రణీత, భూమేష్ గౌడ్, ఎర్రవెల్లి నాగరాజు, సాసల రాజు, కచ్చకాయల మహేష్ , బొడ్డు రమేష్ , దేవయ్య , మహేష్ , సురేష్ , కరుణాకర్ , రైతులు తదితరులు పాల్గొన్నారు.

భరోసా కల్పించేలా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

- రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి



గోదావరిఖని, నవంబర్ 17 (ప్రజాజ్యోతి):ప్రజల జీవితాలకు భరోసా కల్పించే పథకం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం పై మంగళ వారం ఎన్ టి పి సి మిలీనియం హాల్ లో ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు.కుటుంబంలో బీమా చేసిన వ్యక్తి మృతి చెందితే కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులకు గురి కాకుండా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ద్వారా రూ 5లక్షల తక్షణ ఆర్థిక సహాయం అందుతుందన్నారు.ప్రతి కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించడానికి,ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రతి కుటుంబానికి భద్రత కల్పించడమే ధ్యేయంగా ఈ పథకం ప్రవేశ పెట్టినట్లు తెలిపారు.ఈ పథకంలో చేరడానికి చెల్లించే ప్రీమియం మొత్తాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. దేశ చరిత్రలో ప్రప్రథమమన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి కలిసి గొప్ప సంకల్పంతో తీసుకొచ్చిన ఈ పథకం ప్రయోజనాలు ప్రతి కుటుంబానికి చేరేలా కార్పొరేటర్లు బాధ్యత తీసుకోవాలని సూచించారు.ఎవరూ అవగాహన లేకుండా ఈ పథకాన్ని కోల్పోకూడదని నమోదు సమయంలో ఆధార్,కుటుంబ వివరాలు,నామినీ వివరాలను సక్రమంగా నమోదు చేసుకునేలా ప్రజలకు వివరించాలని కోరారు .సామాజిక మాధ్యమాల ద్వారా ప్రతి ఒక్కరు విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. ఎం ఎల్ ఎ రాజ్ ఠాకూర్ నేతృత్వంలో వెయ్యి కోట్లతో రామగుండంలో జరుగుతున్న అభివృద్ధిని కూడా వాడ వాడలా వివరించాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ ప్రతిష్టాత్మక సామాజిక భద్రతా పథకంలో ఏ ఒక్కరు కూడా నష్ట పోకుండా వివరాలు నమోదు చేయాలన్నారు.డేటా సరిగా నమోదు చేయకపోతే అర్హులు నష్ట పోవడంతో పాటు ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని చెప్పారు.రామగుండం కార్పొరేషన్ కమిషనర్ జె.అరుణ శ్రీ మాట్లాడుతూ పథకం విధి విధానాలు వివరించారు.18 ఏళ్ళ నుంచి 59 ఏళ్ల లోపు వయస్సు ఉన్నకుటుంబంలో సంపాదించేవ్యక్తి ఈబీమా పథకానికి అర్హులని అన్నారు.ఆధార్ కార్డ్ లో ఉన్న జనన తేదీని ప్రామాణికంగా తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.ఇటీవల సేకరించిన జన గణన 2026 డేటా సిద్ధంగా ఉన్న నేపథ్యంలో అవసరమైన మరికొన్ని వివరాలు నగర పాలక సంస్థ సిబ్బంది సేకరించి ఆన్ లైన్ నమోదు చేస్తారని అన్నారు.ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరిస్తూ పథకంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొలని కవిత,పలువురు కార్పొరేటర్లు రామగుండం కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి,సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి,ఇన్ చార్జ్ ఎ సి పి నవీన్,సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, నగర పాలక సంస్థ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

- 88 వేల మందికి పైగా స్వామివారి దర్శనం



వేములవాడ,నవంబర్,17:ప్రజాజ్యోతి రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీ బద్ది పోచమ్మ ఆలయంలో ఈరోజు (మంగళవారం) భక్తుల రద్దీ నెలకొంది.అమ్మవారికి మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు,బెల్లం సాక,ఒడిబియ్యం,పట్నాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.అధికారుల పర్యవేక్షణ: ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.ఆలయ డీఈఓ ప్రతాప్ నవీన్ కుమార్ , ఏఈఓలు , పర్యవేక్షకులు ఆలయ ఉద్యోగులు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.భీమేశ్వర స్వామి దర్శనం:నిన్న (కార్తీక మాసం మొదటి సోమవారం) సందర్భంగా ఉదయం నుండి రాత్రి 9 గంటల వరకు 88,668 మంది భక్తులు శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ పీ ఆర్ ఓ పెరిక శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

■ ప్రభుత్వ విప్ చింత కుంట విజయ రమణా రావు



కాల్వ శ్రీరాంపూర్ నవంబర్ 17, (ప్రజాజ్యోతి) నేను గతంలో ఎమ్మె ల్యేగా రెండుసార్లు ఓడిపోయినప్పటికీ. కాల్వ శ్రీరాంపూర్ మండలం ప్రజలు నాకు మెజార్టీ ఓట్లు వేశారు. అట్లాంటి కాల్వ శ్రీరాంపూర్ మండలాన్ని నేను ఎట్లా మర్చిపోతానని పెద్దపెల్లి శాసన సభ్యులు ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు అన్నారు .

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రం లోని రెడ్డి ఫంక్షన్ హాల్ లో. మంగళ వారం రోజున చేయాత మంజూరు పత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని. ఎంపీ డీవో సురేందర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై. చేయూతమంజూరుపత్రాలనులబ్ధిదా రులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం ఇస్తుందని అన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డుల కొరకు ఆసరా పింఛన్ల కొరకు ఎదురు చూశారని. ఇప్పుడు వారి కళ సాకారం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని అన్నారు. నూతనంగా 400 ఇందిరమ్మ గృహా లను మంజూరు చేశానన్నారు. సహజ మరణానికి ఐదు లక్షల రూపాయల బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పి స్తుంది అన్నారు. రైతులు వరికి బదు లుగా ఆరో తడిపంటలు వేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్. తహసి ల్దార్ డాక్టర్ రాపల్లి రాము డు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్. మాజీ జెడ్పిటిసి లంక సదయ్య. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గా జన వేన సదయ్య. సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు బంగారు రమేష్ లతోపాటు. వివిధ గ్రామాల సర్పం చులు. మాజీ ఎంపిటిసిలు. మాజీ సర్పంచులు.తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి: ఎస్సై జగదీశ్వర్



చిగురుమామిడి /నవంబర్ 17, ప్రజాజ్యోతి: నేర రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ముఖ్యంగా యువత చెడు వ్యసనా లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్ పిలుపునిచ్చారు. చిగురుమామిడి మండలంలోని ఓగులా పూర్ గ్రామంలో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో నేరాల నియంత్రణ, శాంతిభ ద్రతల పరిరక్షణపై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జగదీశ్వర్ మాట్లాడుతూ.. గంజాయి వంటి మత్తు పదా ర్థాలు, మద్యం సేవేనానికి యువత దూరంగా ఉండాలని సూచించారు. ఇలాంటి అలవాట్ల వల్ల భవిష్యత్తు నాశనం కావడంతో పాటు కుటుంబాలు కూడా ఆర్థిక, సామాజిక ఇబ్బందులకు గురవుతాయని హెచ్చరించారు.దొం గతనాలు, ఇతర అస్తి సంబంధిత నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నేరాల నియంత్రణకు, నేరస్తులను త్వరగా గుర్తించడా నికి వీలుగా ఇళ్ల వద్ద మరియు గ్రామంలోని ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలా పాలు జరిగినా, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మల్యాల గ్రామ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తా : ఎంపీ గడ్డం వంశీకృష్ణ



కాల్వ శ్రీరాంపూర్ నవంబర్ 17 (ప్రజా జ్యోతి) మల్యాల గ్రామ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని. మల్యాల గ్రామ హైస్కూల్లోని విద్యార్థులకు. స్కూల్ బ్యాగులు అందజేశారు. సిసి రోడ్డు పనులను ఆయన శంకుస్థాపన చేశారు. పాఠశాలకు బెంచీలను అందించనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూసి సదాశివరెడ్డి. ఉపసర్పంచి సదయ్య. వార్డు సభ్యులు సుమలత. సురేందర్. గ్రామ సెక్రెటరీ రమాదేవి. కడారి వీరస్వామి,. కడారి శ్రీధర్. గోబురవి .కామెడీ వెంకట్ రెడ్డి. విద్యార్థులు. ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ గడ్డం వంశీకృష్ణకు అవమానం



కాల్వ శ్రీరాంపూర్ నవంబర్ 17 (ప్రజాజ్యోతి) కాల్వ శ్రీరాంపూర్ మండలకేంద్రంలోనిరెడ్డిఫంక్షన్ హాల్ లో. ఎంపీడీవో సురేందర్ కుమార్ ఆధ్వర్యంలో .మంగళ వారం రోజున చేయాత మంజూరు పత్రాల పంపిణీ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపి గడ్డం వంశీ కృష్ణ హాజరయ్యారు. ఈ కార్యక మానికి ప్రభుత్వ విప్పు చింత కుంట విజయ రామారావు రావాల్సి ఉండగా ఆయన రాకకు ఆలస్యమైంది. దీనితో ఈయన ఒక్కడే ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. సభ కింద ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు నువ్వు ఎట్లా మాట్లాడతావని ఆయనను విమర్శిం చారు. దీనితో కొంతసేపు రాదోప వాదం జరిగింది. అయ్యప్ప మాలతో ఉన్న ఆయ న. ఏమి మాట్లాడకుండా. వెళ్లిపోయారు. దీంతో నాయకులు కార్యకర్త లు మధ్య పలు రకాలుగా చర్చ చర్చ జరిగింది.

చలో మేడారానికి ఉద్యమకారుల ఫోరం పిలుపు



రామగిరి, నవంబర్ 17 (ప్రజాజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, గుర్తింపు కార్డుల జారీని ప్రభుత్వం వేగవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు కోరారు. మంగళవారం రామగిరి మండలం సెంటినరీ కాలనీలోని అమ రవీరుల స్థూపం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ఉద్యమకా రుల సంక్షేమంపై కేకేకమిటీ త్వరగా నివేదిక సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.అర్హులకు నెలకు రూ.25 వేల పెన్షన్, 250 గజాల ఇంటి స్థలం కల్పించాలని కోరారు. ఈ నెల 22న ఆదివారం ఉదయం 6 గంటలకు చేపట్టనున్న చలో మేడారం కార్యక్రమంలో 33 జిల్లాల ఉద్యమకారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పోతు జ్యోతి రెడ్డి, ఉపాధ్యక్షుడు నూనె రాజేశం, కార్యదర్శి బత్తుల శంకర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జూనుగారి సుధాకర్, ఉద్యమకారులు కొండ సమ్మయ్య, కీర్తి లక్ష్మీనారాయణ, దూట సూర్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంథనిలో ఘనంగా గోపాష్టమి వేడుకలు



మంథని, నవంబర్ 17 (ప్రజాజ్యోతి): గోపాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ మంథని ఆధ్వర్యంలో పట్టణంలో శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ ప్రాంగణంలో గోపూజ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పూల మాలలతో అలంకరించి, హారతులు సమర్పించారు. అనంతరం గోమాతకు పూజలు చేసి గోమాత ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ గోమాత భారతీయ సంస్కృతికి, సనాతన ధర్మానికి ప్రతీక అని, హిందూ సంప్రదాయంలో గోమాతకు విశిష్టమైన స్థానం ఉందని తెలిపారు. గోవు లను పూజించడమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గోసంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని విశ్వ హిందూ పరిషత్ మంథని ప్రకంద అధ్యక్షులు రావుల సతీష్ పిలుపునిచ్చారు. గోమాతను కాపాడుకోవడం అంటే మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడు కోవడమేనని తెలిపారు. ప్రతి ఇంట్లో గోమాత పట్ల భక్తిభావం, గోసేవా దృక్పథం పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పెద్దపల్లి జిల్లా సహ కార్యదర్శి అడిగొప్పుల రాజు, జిల్లా ఉపాధ్యక్షులు కొత్త శ్రీని వాస్ గుప్తా, మంథని ప్రకండ కార్యదర్శి నామనీ నాగేష్, సత్సంగ్ ప్రాముఖ్ కొము రవెల్లి హరిష్ గుప్తా, ఉపాధ్యక్షులు మాదాడి నరేందర్ రెడ్డి, కొమురవెల్లి సత్యనా రాయణ, బోట్ల ఆంజనేయులు, సహకార్యదర్శులు గుండా శ్రీనివాస్, గాజుల సురేష్, వడ్ల కొండ శ్రావణ్, మందిర్మట్ ప్రాముఖ్ మెదగొని రాజమౌళి, గౌడ్, గోరక్షా ప్రముఖ్ నూక శ్రీనివాస్, ప్రచార ప్రాముఖ్ తూర్పాటి రాము, కార్యకర్తలు, ఏళ్లంకి హరిష్, నిమ్మతి శ్రీనివాస్, బొడ్డు వెంకటేష్. మాచిడి శ్రీధర్, కొమురవెల్లి కిరణ్.శివ, సాయి, వడ్లకొండ శంకర్, బండారి ప్రసాద్, ఆలయ పూజారి ప్రసాద్, చైర్మన్ తిరుమలేశ్, మహిళా మాతలు సునీత, గాదె లావణ్య, ఉష, బజరంగ్ దళ్ కార్యకర్తలు, మంత్రపురి హిందూ బంధువులు, భక్తులు పాల్గొన్నారు.

మానకొండూర్ పోలీస్ స్టేషన్‌లో సీపీ ఆకస్మిక తనిఖీ





కరీంనగర్ క్రైం, నవంబర్ 17, (ప్రజాజ్యోతి): మానకొండూర్ పోలీస్ స్టేషన్‌ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిం చారు. జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ కాపీలు, పెండింగ్ కేసులు, రౌడీషీటర్ల వివరా లను తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ ఆవరణ, రిసెప్షన్ కౌంటర్, లాకప్ గదు లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితుల సమస్య లను ఓపికగా విని త్వరితగతిన పరిష్కరించాలని సీపీ ఆదేశించారు. శాంతిభ ద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. స్టేషన్ పరిధిలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ అనుమా నిత వ్యక్తులు, నేరాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. నేరాల నియంత్ర ణకు పోలీసు సిబ్బంది సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదే శించారు.ఈ తనిఖీలో మానకొండూర్ సీఐ శ్రీలతతో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కూల్చివేతల మాటున అక్రమ దందాలు

- 3ఏళ్ళ కాంగ్రెస్ పాలనలో ఒరిగిందేమిలేదు
- నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలి
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి



గోదావరిఖని, నవంబర్ 17 (ప్రజాజ్యోతి) : రామగుండం ఎమ్మెల్యే ఈ ప్రాంతంలో కూల్చివేతలో మాటను అనేక అక్రమ దందాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కోరు కంటి చందర్,బి రాష్ట్ర నాయకులు కౌశికహరి వ్యాల హరీష్ రెడ్డి ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలు,అనేక హామీ లతో అధికారంలోకి వచ్చి మూడేళ్ల గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీ లను పూర్తిస్థాయిలో అమలు చేయలే దని కోరుకంటి చందర్ విమర్శిం చారు.మంగళవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావే శంలో వారు మాట్లాడారు.

మహిళలకు ఇచ్చిన హామీలు,విద్యా ర్థినులకు స్కూటీలు, నిరుద్యోగ భృతి, వృద్ధులు, వికలాంగులకు పెంచుతా మని ప్రకటించిన పింఛన్ల పై మాట్లాడటం లేదన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాం లో కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి చెక్కులు అందించా మని గుర్తుచేశారు.ప్రస్తుతం కళ్యాణ లక్ష్మి కింద లక్షా 116 రూపాయల ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం హామీ అమలు కావడం లేదని విమర్శించారు.పట్టణ అభివృద్ధి కోసం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సీఎం ప్లాన్ గ్రాంట్ కింద సుమారు రూ.200 కోట్ల నిధులు కేటాయించా రని తెలిపారు.గతంలో అభివృద్ధి పను లకు గుర్తుగా ఏర్పాటు చేసిన పైలాన్‌ను కూల్చివేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులను కొనసాగించాల్సింది పోయి,వాటికి ఆటంకాలు కలిగించడం ఏమిటని ప్రశ్నించారు. . మార్కెట్ల నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు.కూల్చివేత లకు చూపుతున్న శ్రద్ధ అభివృద్ధి పను లను పూర్తి చేయడంలో ఎందుకు కని పించడం లేదని ప్రశ్నించారు. లక్ష్మీన గర్ వ్యాపార సముదాయంలోని చిరు వ్యాపారులను రోడ్డుపైకి నెట్టివేశారని ఆరోపించారు.

స్థానికంగా వ్యాపారం చేసుకునే వారికి ఇబ్బందులు కలగడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్ప డిందని పేర్కొన్నారు. స్థానిక కాంట్రా క్టర్లను పక్కనపెట్టి హైదరాబాదు నుంచి కాంట్రాక్టర్లను తీసుకురావ డంలో ఆంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు.అభివృద్ధి పేరుతో వ్యాపా రుల ఉపాధికి ఇబ్బందులు కలగ కుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయా ల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. 3 ఏళ్ల పాలనలో ఇచ్చిన హామీల అమలు,నిలిచిపోయిన అభివృద్ధి పను లపై ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఈ అంశా లపై ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ కార్యాచరణ చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు.కూల్చివేతలపై చూపుతున్న శ్రద్ధ అభివృద్ధి పనులను పూర్తి చేయడంలో ఎందుకు కనిపిం చడం లేదని నిలదీశారు.లక్ష్మీనగర్ వ్యాపార సముదాయంలోని చిరు వ్యాపారులను రోడ్డుపైకి నెట్టివేశారని ఆరోపించారు.స్థానికంగా వ్యాపారం చేసుకునే వారికి ఇబ్బందులు కలగ డంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.3ఏళ్ల పాల నలో ఇచ్చినహామీల అమలు,నిలిచిపో యిన అభివృద్ధి పనులపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందిం చి అక్రమ దందాలు మానుకొని,అభి వృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు.

లేనిపక్షంలో రానున్న ఎన్నికలలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చ రించారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ కార్యాచరణ చేపట్టను న్నట్లు ప్రకటించారు.ఈ సమావే శంలో ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య యాదవ్,బొడ్డు రవీందర్, నూతి తిరు పతి,మూల విజయరెడ్డి పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా వేతనాల కోసం ఎదురుచూపులు!

- ఓసీపీ-1 సీహెచ్‌పీ హౌస్‌కీపింగ్ కార్మికుల కష్టాలు
- జీతాలు లేక కుటుంబ పోషణ భారమైందని కార్మికుల ఆవేదన..



రామగిరి, నవంబర్ 17 (ప్రజాజ్యోతి) : రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కార్మికులకు నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. సింగరేణి ఆర్జీ–3 ఏరియాలోని ఓసీపీ–1 సీహెచ్‌పీ హౌస్‌కీపింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు నాలుగు నెలలుగా వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రతిరోజూ విధులకు హాజరై తమ బాధ్యతలు నిర్వర్తిస్తున్నా, చేసిన పనికి రావాల్సిన జీతాలు సకాలంలో అందడం లేదని వారు వాపోతున్నారు. నెలవారీ ఆదాయంపైనే ఆధారపడి జీవించే తమకు నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో ఇంటి ఖర్చులు, పిల్లల చదువులు, నిత్యావసరాల కొనుగోలు కోసం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పనిచేసినందుకు రావాల్సిన వేతనాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. దీనికి తోడు సింగరేణి లాభాల వాటా కింద అందాల్సిన రూ.5,500 కూడా పెండింగ్‌లో ఉండటంతో కార్మికుల్లో ఆందోళన నెలకొంది. కార్మికుల శ్రమకు గుర్తింపుగా అందాల్సిన వేతనాలు, లాభాల వాటా సకాలంలో అందేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కార్మికుల సమస్యకు అండగా ఐఎఫ్‌టీయూ నిలిచింది. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. వెంకన్న మంగళవారం ఆర్జీ–3 జీఎం మధుసూదన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ నెల 4న లేబర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాంట్రాక్టర్‌తో సంబంధం లేకుండా యాజమాన్యం నేరుగా జోక్యం చేసుకుని నాలుగు నెలల వేతన బకాయిలతో పాటు రూ.5,500 లాభాల వాటాను తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సది రవి, సలీం తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్లో వ్యాసరచన పోటీలు



చొప్పదండి నవంబర్ 17 (ప్రజాజ్యోతి): చొప్పదండి మండలం రుక్మాపూర్ సైనిక్ స్కూల్లో మంగళవారం గ్రంధాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాజాదత్త, ప్రిన్సిపాల్ దేవేందర్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పట్టణాన్ని అలవర్చుకొని, జ్ఞానాన్ని సృజనాత్మకతను పెంపొందించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సుధాకర్ రెడ్డి, మునీందర్, మహేందర్ పాల్గొన్నారు.

ప్రజావాణికి 231 దరఖాస్తులు



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 17 (ప్రజాజ్యోతి)ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ లో ఉంచకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ 231(పిల్లల ప్రజావాణి దరఖాస్తులు 21 కలిపి) మంది అర్జీలు సమర్పించారు.అత్యధికంగా హౌసింగ్ కార్పొరేషన్‌కు 51,మున్సిపల్ కార్పొరేషన్‌కు 75 దరఖాస్తులు అందాయి.బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా పిల్లల హక్కులు, పరిరక్షణ వారి సమస్యల పరిష్కారానికి సాధారణ ప్రజావాణితో పాటు పిల్లల ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక డెస్క్ లో పిల్లలు తమ సమస్యలపై ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు.అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీఆర్ఓ స్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా సామూహిక కార్తీక దీపోత్సవం





వేములవాడ,నవంబర్,17:ప్రజాజ్యోతి. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా, 7వ రోజు వేదుకలను ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి గారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నవంబర్ 10వ తేదీ నుండి డిసెంబర్ 8వ తేదీ వరకు కొనసాగనున్న ఈ పవిత్ర కార్తీక మాస పర్వదినాల సందర్భంగా, ప్రతిరోజూ సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు సుహాసినుల ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో సామూహిక దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు శ్రీ రాజరాజేశ్వరి సేవాసమితి సభ్యులకు ఆలయ అర్చకులు, అధికారులు పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులు, వాయనంతో పాటు శ్రీ స్వామివారి చిత్ర పటాన్ని అందజేశారు.

రైతుల ఆర్థిక అభివృద్ధికి దీర్ఘకాలిక రుణాలు దోహదం

- మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్



మంథని, నవంబర్ 17 (ప్రజాజ్యోతి): రైతుల ఆర్థిక అభివృద్ధి, వ్యవసాయ అనుబంధ అవసరాల కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా అందిస్తున్న దీర్ఘకాలిక రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ సూచించారు.ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి.,మంథని ఆధ్వర్యంలో మంథని మండలం మంథని, బిట్టుపల్లి గ్రామాలకు చెందిన ముగ్గురు రైతులకు దీర్ఘకాలిక రుణాల చెక్కులను సంఘ కార్యాలయంలో సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, సంఘ కార్యదర్శి బొద్దుల సమ్మయ్య అందజేశారు. ఈ సందర్భంగా మంథని గ్రామానికి చెందిన చందుపట్ల శ్రీనివాస్‌రెడ్డికి రూ.5 లక్షలు, ఆకుల వంశీకుమారికి రూ.6 లక్షలు, బిట్టుపల్లి గ్రామానికి చెందిన మాటేటి కుమారస్వామికి రూ.6 లక్షల చొప్పున మొత్తం రూ.17 లక్షల విలువైన రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా రైతులకు అవసరమైన రుణ సదుపాయాలు కల్పిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. రైతులు సహకార సంఘం అందిస్తున్న రుణ సదుపాయాలను వినియోగించుకొని వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- రైతులకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- సర్పంచ్ కదిరే రమేష్



సైదాపూర్ సవంబర్ 17 (ప్రజా జ్యోతి) సైదాపూర్ విశాల సహకార పరపతి సంఘం లిమిటెడ్ (సింగిల్ విండో) ఆధ్వర్యంలో సైదాపూర్ సంఘ పరిధిలోని అమ్మనగుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో అధ్యక్షులు కొత్త తిరుపతిరెడ్డి, వెన్నంపల్లి సింగిల్ విండో అధ్యక్షులు రవీందర్ గౌడ్, గ్రామ సర్పంచ్ కదిరే రమేష్ సమక్షంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కదిరే రమేష్ మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించేలా కొనుగోలు కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. రైతులు దళారుల మాటలు నమ్మి తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోవద్దని సూచించారు.ప్రతి రైతు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారానే ధాన్యాన్ని విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని కోరారు.రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ముందు నాణ్యతా ప్రమాణాలు, తేమ శాతం వంటి నిబంధనలను పాటించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు, సిబ్బంది సహకరించాలని కోరారు.

›» ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు

గ్రేడ్–ఏ ధాన్యం క్వింటాలుకు రూ.2,461.సాధారణ రకం (గ్రేడ్–సి) ధాన్యం క్వింటాలుకు రూ.2,441.సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు అదనంగా రూ. 500 బోనస్.రైతులు తొందరపడి ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా, ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర, బోనస్ ప్రయోజనాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సర్పంచ్ రమేష్ విజ్ఞప్తి చేశారు.రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుంది.. రైతు ఆర్థికంగా బలపడితేనే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుంది. రైతులు పండించిన ప్రతి గింజకు న్యాయమైన ధర లభించాలన్నదే తమ ఆకాంక్ష అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు కొత్త తిరుపతిరెడ్డి, రవీందర్ గౌడ్, డైరెక్టర్ పల్లేని ప్రవీణ్ రావు, సీఈవో శ్రీధర్, రైతులు పల్లేని తిరుపతిరావు, భీమ్ రెడ్డి దేవేందర్ రెడ్డి, అరికొప్పుల కృష్ణారావు, హమాలీలు భాష వేణి ఓదెలు, గొర్రె ఓదెలు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమ పంజాబ్ సింహం లాలాలజపతిరాయ్‌కు ఘన నివాళి

- ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ



వేములవాడ,నవంబర్,17: ప్రజాజ్యోతి భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ జాతీయవాది, పంజాబ్ కేసరిగా పేరుగాంచిన లాలా లజపతిరాయ్ 98వ వర్ధంతిని పురస్కరించుకుని వేములవాడ న్యూ అర్బన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ లజపతిరాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, లాలా లజపతిరాయ్ దేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత నాయకుడని కొనియాడారు. బాల గంగాధర తిలక్, బిపిన్ చంద్రపాల్‌లతో కలిసి లాల్–బాల్–పాల్ త్రయంలో కీలక పాత్ర పోషించి, స్వదేశీ ఉద్యమం, విదేశీ వస్తువుల బహిష్కరణ ద్వారా ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని రగిలించారని తెలిపారు.సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో బ్రిటిష్ పోలీసుల లాఠీ దెబ్బలకు తీవ్రంగా గాయపడి 1928 నవంబర్ 17న తుదిశ్వాస విడిచారని గుర్తుచేశారు. ఆయన త్యాగం, దేశభక్తి నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, కంకెల్కార్ మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైవిధ్య పంటల సాగుతో రైతుకు మెరుగైన ఆదాయం

- డ్రిప్ విధానంతో నీటి పొదుపు.. ఐదు రకాల కూరగాయల సాగుతో నిరంతర ఆదాయం
- బందనకల్ రైతు చింతలకుల చంద్రం సాగు విధానాన్ని పరిశీలించి అభినందించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్





ముస్తాబాద్, సవంబర్ 17 (ప్రజా జ్యోతి): సంప్రదాయ వరి సాగుకు భిన్నంగా వైవిధ్యమైన పంటలు సాగు చేస్తూ తక్కువ నీటితో మెరుగైన ఆదాయం పొందవచ్చని బందనకల్ గ్రామానికి చెందిన రైతు చింతాకుల చంద్రం నిరూపిస్తున్నారు. ఆధునిక సాగు పద్ధతులను అనుసరిస్తూ, బిందు సేద్యం ద్వారానీటినిపొదుపు చేసుకుంటూ వివిధ రకాల కూరగాయలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.ముస్తాబాద్ మండలం బందనకల్ గ్రామానికి చెందిన రైతు చింతాకుల చంద్రం తన కున్న మూడు ఎకరాల వ్యవసాయ భూమిలో సంప్రదాయ వరి సాగును పక్కనపెట్టి కూరగాయల సాగుపై దృష్టి సారించారు. ఇందుకోసం వ్యవసాయ క్షేత్రంలో నీటి నిల్వ కోసం ఫార్మ్ పాండ్ ఏర్పాటు చేసుకొని, బిందు సేద్యం పద్ధతిని అందుబాటులోకి తెచ్చుకున్నారు. దోసకాయ, కాకరకాయ, బీరకాయ, టమాట, పచ్చిమిర్చితో పాటు వేరుశెనగ పంటను సాగు చేస్తున్నారు.ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ పంటల సాగు చేపడుతున్నారు. ఒకే రకమైన పంటపై ఆధారపడకుండా వివిధ రకాల పంటలను సాగు చేయడం ద్వారా మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఆదాయం పొందుతున్నారు. బిందు సేద్యం ద్వారా నీటి వినియోగాన్నితగ్గించుకుంటూ పంటలకు అవసరమైన నీటిని అందిస్తున్నారు.

›» ఏడాదికి రూ.3 నుంచి 4 లక్షల ఆదాయం

రైతు చింతాకుల చంద్రం చేపట్టిన వైవిధ్య పంటల సాగును జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుతో మాట్లాడి సాగు విధానం, పంటల విస్తీర్ణం, దిగుబడి, మార్కెటింగ్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పండించిన కూరగాయలను ఎక్కడ విక్రయిస్తున్నారు? ఏడాదికి ఎంత ఆదాయం వస్తుంది? సాగుకు ఎంత ఖర్చవుతోంది? అనే వివరాలను ఆరా తీశారు.దీనికి రైతు స్పందిస్తూ మూడు ఎకరాల్లో వివిధ రకాల కూరగాయలు, ఇతర పంటలు సాగు చేస్తూ ఏడాదికి సుమారు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయం పొందుతున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. పండించిన కూరగాయలను ముస్తాబాద్, సిరిసిల్ల పట్టణాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు.వరి సాగుతో పోలిస్తే ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా మెరుగైన ఆదాయం పొందేందుకు ఉన్న అవకాశాలను రైతు వివరించారు. ఆధునిక సాగు పద్ధతులను అనుసరిస్తూ,నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ లాభదాయకమైన పంటలు పండిస్తున్నరైతు చంద్రంను కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రదీప్, ముస్తాబాద్ తహసీల్దార్ ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



ముస్తాబాద్, సవంబర్ 17 (ప్రజా జ్యోతి):పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. గత సంవత్సరాల ప్రశ్నాపత్రాలను సాధన చేస్తూ, పరీక్షల సమయంలో నిర్దిష్ట గడువులో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసే విధంగా అభ్యాసం చేయాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.మంగళవారం ముస్తాబాద్ మండలం చీకోడు గ్రామంలోని ప్రభుత్వ విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సందర్శించి పాఠశాలలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ముందుగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ కంచెను ప్రారంభించారు. అనంతరం మధ్యాహ్న భోజన గదిని పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకురాలికి పలు సూచనలు చేశారు. కంప్యూటర్ గదిని సందర్శించి అక్కడి సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి చదువుల పురోగతిని తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ గణితంలో పలు ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తూ చదువులో మరింత శ్రద్ధ కనబరచాలని సూచించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు అన్ని సబ్జెక్టులను పూర్తిస్థాయిలో చదవడంతో పాటు రాయడం కూడా నిరంతరం సాధన చేయాలని తెలిపారు. గత సంవత్సరాల ప్రశ్నాపత్రాలను పరిశీలించి, వాటిని సమయపాలనతో రాయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. వార్షిక పరీక్షల్లో కేటాయించే సమయానికి అనుగుణంగా ఇప్పటి నుంచే ప్రశ్నలకు సమాధానాలు రాసేలా సాధన చేయాలని చెప్పారు. కేవలం చదవడమే కాకుండా, రాత సాధనకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.ప్రస్తుతం పదో తరగతిలో సాధించే మార్కులు భవిష్యత్తులో విద్యార్థులు ఎంచుకునే ఉన్నత విద్య, కోర్సులు, అవకాశాలకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులు ఎలాంటి నేపథ్యం నుంచి వచ్చినప్పటికీ పట్టుదలతో కష్టపడి చదివితే మంచి విజయాలు సాధించవచ్చని అన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని అన్ని సబ్జెక్టుల్లో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడటంతో పాటు సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేసే పదో తరగతి విద్యను నిర్లక్ష్యం చేయకుండా క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫారూఖ్, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బాకం సాయికిరణ్‌కు మరో కీలక పదవి

- సాదర్ ఉత్సవ కమిటీ సుల్తానాబాద్ మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవ ఎన్నిక
- ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం
- నూతన అధ్యక్షుడు బాకం సాయికిరణ్ యాదవ్



సుల్తానాబాద్, నవంబర్ 17: (ప్రజా జ్యోతి) సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ఆరో వార్డు కౌన్సిలర్, సామాజిక సేవకుడు బాకం సాయికిరణ్ యాదవ్‌కు మరో కీలక పదవి వరించింది. సుల్తానాబాద్ మండల సాదర్ ఉత్సవ కమిటీ నూతన కార్యవర్గ ఎంపికలో భాగంగా ఆయనను మండల అధ్యక్షుడిగా కమిటీ సభ్యులు, కుల పెద్దలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటికే ఆరు వార్డ్ కౌన్సిలర్‌గా ప్రజలకు సేవలందిస్తున్న ఆయనకు మరో బాధ్యత దక్కడం పట్ల యాదవ సంఘం నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.నూతన కార్యవర్గంలో మండల అధ్యక్షుడిగా బాకం సాయికిరణ్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా ఓజ్జ సతీష్ యాదవ్, కోశాధికారిగా మాజీ కౌన్సిలర్ కూకట్ల గోపి యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యాదవ సంఘం పెద్దలు, సభ్యులు నూతన కార్యవర్గంపై విశ్వాసంతో కీలక బాధ్యతలు అప్పగించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కోశాధికారికి పలువురు నాయకులు, సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బాకం సాయికిరణ్ యాదవ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకుని బాధ్యతలు అప్పగించిన కుల పెద్దలు, సంఘం సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నూతన కమిటీ సభ్యులందరినీ కలుపుకొని సాదర్ ఉత్సవాలను ఐకమత్యంతో, అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు ప్రతిబింబించేలా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషిచేస్తానన్నారు.సంఘం ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ అందరి సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.బాకం సాయికిరణ్ యాదవ్‌కు మరో బాధ్యత దక్కడం పట్ల పలువురు సంఘం పెద్దలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం





- అర్హులైన ప్రతి ఒక్కరికి చేయూత పెన్షన్ అందజేస్తాం.
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర 17/నవంబర్/2026: (ప్రజా జ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం మధురానగర్ లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో లబ్ధిదారులకు చేయూత పెన్షన్ మంజూరి పత్రాలను పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే తో కలిసి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గంగాధర మండలంలోని 33 గ్రామాలకు చెందిన 897 మంది లబ్ధిదారులకు చేయూత పెన్షన్ మంజూరి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గంగాధర మండలంలో 389 వితంతు, 26 వికలాంగుల, 101 గీత కార్మిక, 75 ఒంటరి మహిళ, 126 చేనేత పెన్షన్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. చొప్పదండి నియోజక వర్గం లోని అర్హులైన ప్రతి ఒక్కరికి చేయూత పెన్షన్ అందజేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, పేదలకు ఉచిత సన్న బియ్యం, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో రాము, ఎంపీఓ ప్రత్యూష, ఏఓ ఆర్. శ్రీనివాస్ మండల సర్పంచులు మరియు అధికారులు పాల్గొన్నారు.

రేయింబవళ్లు నిఘా.. అక్రమ ఇసుక దందాకు ఎస్సై తిరుపతి చెక్

- ఒకరిపై కేసు నమోదు..



వీణవంక, నవంబర్ 17 (ప్రజాజ్యోతి) ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను వీణవంక పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులోని వాగు నుంచి గెల్లు అశోక్ (29) తనకు చెందిన ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను లోడ్ చేసుకొని విక్రయించేందుకు తరలిస్తుండగా పోలీసులు గుర్తించారు. వెంటనే ఎస్సై ఆవుల తిరుపతి సిబ్బందితో కలిసి ట్రాక్టర్‌ను పట్టుకొని, నిందితుడితో పాటు వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని ఎస్సై ఆవుల తిరుపతి హెచ్చరించారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కమ్మరి ఖాన్ పేటలో ఉచిత కంటి వైద్య శిబిరం



ధర్మారం, నవంబర్ 17(ప్రజా జ్యోతి న్యూస్): ధర్మారం మండలం కమ్మరి ఖాన్ పేట గ్రామంలో కొలుముల దామోదర్ యాదవ్ (ఎన్ఆర్ఐ,కెనడా)ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఇరుగురాల మహేష్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మహేష్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తారని,కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు తెలిపారు.గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు వెంటనే స్పందించి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించిన కొలుముల దామోదర్ యాదవ్‌కు గ్రామ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ప్రమోద్,వార్డు సభ్యులు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పెన్షన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- హామీల అమలులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 4.63 లక్షల కొత్త పెన్షన్లు.. జమ్మికుంటలో 584 మందికి మంజూరు



జమ్మికుంట, నవంబర్ 17 (ప్రజా జ్యోతి) ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జమ్మికుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పరుశురాం రావు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆరు గ్యారంటీల అమలుతో పాటు వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4.63 లక్షల పెన్షన్లను మంజూరు చేయగా, ఈ నెల 19న సిద్దిపేట వేదికగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని వెల్లడించారు. హుజూరాబాద్ నియోజకవర్గానికి మొత్తం 3,350 కొత్త పెన్షన్లు మంజూరు కాగా, జమ్మికుంట మండల పరిధిలో 553 మంది లబ్ధిదారులకు మున్సిపల్ అధికారుల ద్వారా పెన్షన్ మంజూరు పత్రాలను అందజేసినట్లు వివరించారు. ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులకు ఈ పెన్షన్లు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ప్రజల సంక్షేమం, పేదల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పరుశురాం రావు పత్రికా ప్రకటనలో స్పష్టం చేశారు.

జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో సీవీఎం ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ



కరీంనగర్ రూరల్,నవంబర్ 17,(ప్రజాజ్యోతి): హన్మకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించిన జాతీయ ఫార్మసీ వారోత్సవాల కార్యక్రమంలో కరీంనగర్ వెలిచాలలోని సీవీఎం కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు తమ ప్రతిభను చాటినట్లు కళాశాల చైర్మన్ డా. చాట్ల శ్రీధర్ తెలిపారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు కేవలం విద్యాభ్యాసానికే పరిమితం కాకుండా,ఔషధాల సురక్షిత వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ప్రజారోగ్య పరిరక్షణలో బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు.యాంటీబయాటిక్స్‌ను వైద్యుల సూచనలు లేకుండా విచక్షణారహితంగా వినియోగించడం వల్లకలిగే దుష్పరిణామాలు,ఔషధాల ప్రభావం తగ్గడం, ప్రజారోగ్యంపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించారు.కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోస్టర్ ప్రజెంటేషన్లు,స్కిట్స్,క్విజ్ పోటీల్లో సీవీఎం ఫార్మసీ కళాశాల 100.మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమలోని సృజనాత్మకత, విషయ పరిజ్ఞానాన్ని ప్రదర్శించారని తెలిపారు,ఈ కార్యక్రమంలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మంటూ కుమార్ పటేల్,ప్రిన్సిపాల్ డా. బి. రాజా నరేందర్ విద్యార్థులు పాల్గొన్నారు,

లబ్ధిదారులకు చేయూత పింఛన్ల పంపిణీ



కరీంనగర్ రూరల్,నవంబర్ 17,(ప్రజాజ్యోతి): నగరంలోని గోపాలపురం గ్రామంలో మంగళవారం అర్హులైన లబ్ధిదారులకు చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 4వ డివిజన్ అధ్యక్షుడు గాదె శివరాం లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.వితంతువులు,చేనేత కార్మికులు,గీత కార్మికులతో పాటు ఇతర అర్హులైన పేదలకు చేయూత పింఛన్లు ఆర్థికంగా ఎంతో అండగా నిలుస్తున్నాయని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పేర్కొన్నారు.

41 మంది లబ్ధిదారులకు చేయూత పెన్షన్ పత్రాలు అందజేత

- నామాపూర్‌లో సర్పంచ్ మాదాసు అనిల్ చేతుల మీదుగా పంపిణీ

ముస్తాబాద్, నవంబర్ 17 (ప్రజా జ్యోతి): ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో అర్హులైన 41 మంది చేయూత పెన్షన్ లబ్ధిదారులకు మంగళవారం మంజూరు పత్రాలు (ప్రొసీడింగ్ కాపీలు) పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ మాదాసు అనిల్ తన చేతుల మీదుగా లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ప్రభుత్వం అర్హులైన వారికి చేయూత పథకం ద్వారా పెన్షన్లు మంజూరు చేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాజు నాయక్, కారోబార్ నరసింహులు పాల్గొన్నారు.



అయ్యప్ప స్వాముల మధ్య ఎంపీ వంశీకృష్ణ ప్రత్యేక పూజలు

- అయ్యప్ప ఆలయంలో స్వామివారికి పూజలు
- అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 17, ప్రజాజ్యోతి:భక్తి భావం, ఆధ్యాత్మిక చింతనతో నిర్వహించే కార్యక్రమాలు సమాజంలో సోదరభావం, సేవాగుణాన్ని పెంపొందిస్తాయని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ అన్నారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.పెద్దపల్లి పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎంపీ గడ్డం వంశీకృష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి అన్నప్రసాదం స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి, సేవాభావం, సమానత్వం వంటి విలువలు సమాజంలో మరింతగా బలపడాలని ఆకాంక్షించారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు కేవలం ఆకలి తీర్చడమే కాకుండా మానవత్వం, పరస్పర సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అయ్యప్ప స్వాముల మధ్య ఆధ్యాత్మిక వాతావరణంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎలనినో పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన



ఇల్లంతకుంట నవంబర్ 17(ప్రజాజ్యోతి)రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపల్లి రైతు వేదికలో మంగళవారం రోజు సర్పంచ్ బద్దం శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో యాసంగిలో ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయంపై కలిగే ప్రభావాలు రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి వివరిస్తూ వరికి బదులుగా తక్కువ నీటి అవసరం ఉన్న ఆరుతడి పంటలు సాగు చేయాలని వివరిస్తూ కేత్ బచావో అభియాన్ ప్రోగ్రాం లో భాగంగ రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులు వేస్తూ నేల ఆరోగ్యం కాపాడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రామకృష్ణ (డి సి ఓ),మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్, మండల రెవెన్యూ అధికారి సురేష్,ఎమ్ పి డి ఓ శశికళ , ఎమ్ పి ఓ వజీర్‌అహ్మద్, వేటర్నరీ అధికారి ఇందిర, ఏ పి ఎమ్ కుమార స్వామి, ఏఈవో అర్చన, పంచాయతి కార్యదర్శి అనిల్ విద్యుత్ లైన్ మెన్ శ్రీనివాస్,ఉపసర్పంచ్లు, వార్డ్ మెంబర్స్ రైతులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో చేయూత పెన్షన్ల పంపిణీ

ఎల్లారెడ్డిపేట నవంబర్ 17 ప్రజా జ్యోతి ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం రోజు మణికంఠ గార్డెన్ లో చేత పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏఎంసీ చైర్మన్ దేవానందం నంది కిషన్ మండల అధ్యక్షుడు రాజేందర్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు దొమ్మాట నరసయ్యసుభాష్ గుండారం కృష్ణారెడ్డి ఇల్లెందులగీతాంజలి మూడవ సరోజ ఎంపీడీవో సత్తయ్య చారి వివిధ గ్రామాల సర్పంచులు చేయూత పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

దళిత ఎంపీని అవమానించడం ప్రజాస్వామ్య విరుద్ధం!

- ప్రోటోకాల్ పాటించకుండా ఎంపీకి తగిన గౌరవం ఇవ్వని అధికారులు
- వ్యక్తిగత స్వార్థం కోసం ఎంపీ పర్యటనపై వివాదం సృష్టిస్తున్నారు
- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదు : కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 17, ప్రజాజ్యోతి:
ప్రజల మద్దతుతో భారీ మెజారిటీ సాధించి పార్లమెంట్‌కు ఎన్నికైన దళిత యువ ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ప్రభుత్వ కార్యక్రమంలో ప్రోటోకాల్ ప్రకారం గౌరవం కల్పించకపోవడం దారుణమని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. వ్యక్తిగత స్వప్రయోజనాలు, రాజకీయ గుర్తింపు కోసం ఎంపీ పర్యటనను వివాదాస్పదం చేయడం, ఆయనను కించపరిచేలా సోషల్ మీడియాలో ప్రచారం చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని కాల్వ శ్రీరాంపూర్ మండలంలో నిర్వహించిన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో చోటుచేసుకున్న ప్రోటోకాల్ వివాదంపై మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో కాంగ్రెస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 12 గంటలకు జరగాల్సిన కార్యక్రమం ఆలస్యం కావడంతో ఎంపీ దాదాపు రెండు గంటల పాటు వేచి ఉండి మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో కార్యక్రమానికి హాజరయ్యారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మరో మండలంలో ముందుగా నిర్ణయించిన కార్యక్రమంలో ఉండటంతో హాజరుకాలేకపోయారని వివరించారు. కార్యక్రమానికి వచ్చిన ఎంపీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారని పేర్కొన్నారు. అనంతరం సభలో మాట్లాడుతూ ఇతర కార్యక్రమాలు ఉండటంతో పాటు సాయంత్రం 6.30 గంటల్లోపు హైదరాబాద్ చేరుకుని పూజా కార్యక్రమానికి హాజరుకావాల్సి ఉందని తెలిపారని వెల్లడించారు. అయితే ఎంపీ కార్యక్రమానికి హాజరైనప్పటికీ మండల స్థాయి అధికారులు ప్రోటోకాల్ నిబంధనలను పాటించకపోవడం బాధాకరమన్నారు. ఎంపీ చేతుల మీదుగా చేయూత పెన్షన్ల పంపిణీ చేపట్టాల్సి ఉండగా, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోకపోవడం ప్రజాప్రతినిధిని అవమానించడమేనని విమర్శించారు. కలెక్టర్ రాక కోసం ఎదురుచూస్తూ కార్యక్రమ నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ పరిణామాలను కొందరు వ్యక్తులు తమ రాజకీయ స్వప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఎంపీని అడ్డుకున్నామంటూ సోషల్ మీడియా గ్రూపుల్లో ప్రచారం చేసుకోవడం, ఆయనను కించపరిచే వ్యాఖ్యలు చేయడం వెనుక వ్యక్తిగత ప్రయోజనాలే ఉన్నాయని ఆరోపించారు. గత 15 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో విద్యార్థి సంఘం, యువజన కాంగ్రెస్ నాయకులుగా పని చేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న తమకు, ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన కొందరు వ్యక్తులు స్వలాభం కోసం వివాదాలు సృష్టించడం సమంజసం కాదన్నారు. ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం కల్పించడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ నిబంధనలను అధికారులు తప్పనిసరిగా పాటించాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో మాజీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు బండారి సునీల్ గౌడ్, ఆరెపల్లి రాహుల్, సజ్జాద్, బొంగూరి కైలాసం, కామ విజయ్, ప్రశాంత్, శ్రీకర్ తడితేరులజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ఎఫెక్ట్.. వేసవి విద్యుత్ డిమాండ్‌కు ముందస్తు ఏర్పాట్లు

- విద్యుత్ పంపిణీ వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ
- 198 కొత్త డీటీఆర్‌లు, 54 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు
- నాలుగు కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, నాలుగు సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- వేసవి ప్రారంభానికి ముందే అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం: ఎస్ఈ గంగాధర్



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 17, ప్రజాజ్యోతి:రానున్న వేసవిలో ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగి విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగే అవకాశం ఉన్ననేపథ్యంలో, పెరగనున్నడిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థను ముందుగానేసిద్ధం చేస్తున్నామని పెద్దపల్లి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. గంగాధర్ తెలిపారు. వేసవిలో వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.అధిక విద్యుత్ లోడ్ నమోదయ్యే ప్రాంతాలను గుర్తించి ఇప్పటివరకు 198 కొత్త డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు) ఏర్పాటు చేశామని, మరో 54 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచామని తెలిపారు. అదేవిధంగా నాలుగు కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు 14 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచామని వెల్లడించారు. నాలుగు నూతన సబ్‌స్టేషన్లను సైతం ఏర్పాటు చేసినట్లు వివరించారు.మిగిలిన ప్రాంతాల్లో అవసరమైన డిస్ట్రిబ్యూషన్, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో డీటీఆర్‌లు, పీటీఆర్‌ల బిగింపు పనులను వేగవంతం చేసినిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలు, పారిశ్రామిక ప్రాంతాల్లో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణంతో పాటు 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్ల సామర్థ్యం పెంపు పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్లు వివరించారు.అభివృద్ధి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వేసవి ప్రారంభానికి ముందే అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని ఎస్ఈ గంగాధర్ తెలిపారు.వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

జాతీయ, రాష్ట్ర కమిటీలకు ఎన్నికైన జర్నలిస్టులకు ఘన సన్మానం

- ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా అంకరి ప్రకాష్ మరోసారి ఎన్నిక
- రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా కాల్వ రమేష్, ఎర్రోజు వేణుగోపాల్, ముద్దసాని సమ్మయ్య
- ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి తిరి తిరుపతి గౌడ్‌కు అభినందనలు

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 17, ప్రజాజ్యోతి:జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నూతనంగా బాధ్యతలు చేపట్టిన జర్నలిస్టు సంఘాల నాయకులు అంకితభావంతో పనిచేయాలని పెద్దపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్ ఆకాంక్షించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ సంఘాల బలోపేతానికి పాటుపడాలని సూచించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (TUWJ H-143) తరఫున ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా మరోసారి ఎన్నికైన అంకరి ప్రకాష్‌తో పాటు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన కాల్వ రమేష్, ఎర్రోజు వేణుగోపాల్, ముద్దసాని సమ్మయ్యలను మంగళవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో సహచర జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు. ఇటీవల ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన తిరి తిరుపతి గౌడ్‌ను సైతం శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా గుడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నూతన బాధ్యతలు చేపట్టిన వారంతా సమష్టిగా పనిచేయాలని అన్నారు. తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ జర్నలిస్టుల హక్కుల సాధనలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇదే కార్యక్రమంలో బీఆర్ఎస్ పెద్దపల్లి పట్టణ శాఖ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్ ఆధ్వర్యంలోనూ ఎన్నికైన జర్నలిస్టులను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు బెజ్జంకి నరేష్, కోశాధికారి ఆరెల్లి మల్లేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జంగిలి రాజు యాదవ్, సహాయ కార్యదర్శి ఆర్కూట మల్లేష్ యాదవ్, కార్యవర్గ సభ్యులు కొయ్యడ తిరుపతి, తిరి శంకర్ గౌడ్, సాబీర్ పాషా, తూర్పాటి శ్రీనివాస్, ప్రవీణ్ రెడ్డి, ఇజ్జిగిరి వెంకటేష్, రాజేందర్, జల్దీ శంకర్, దొమ్మటి రాజేష్, లక్ష్మణ్, షేకిల్, ఉమేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



సమ్మాన్ సమారోహ్’లో సురక్షిత్ జిల్లాగా రాజన్న సిరిసిల్ల

- హెచ్ ఐ వీ 95-95-95 లక్ష్యాల సాధనలో జిల్లాకు గుర్తింపు
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కలిసిన నాకో రాష్ట్ర అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి నవంబర్ – 17 (ప్రజాజ్యోతి) నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (నాకో) నిర్దేశించిన హెచ్ ఐ వీ నియంత్రణ 95-95-95 లక్ష్యాల సాధనలో జిల్లా మెరుగైన ప్రగతి సాధించి “సురక్షిత్” జిల్లాగా గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా నాకో రాష్ట్ర అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం జిల్లాను మంగళవారం సందర్శించి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమ సిబ్బందితో మర్యాదపూర్వకంగా కలిశారు. నాకో ఆధ్వర్యంలో చేపట్టిన “సమ్మాన్ సమారోహ్” కార్యక్రమంలో హెచ్ ఐ వీ నియంత్రణకు సంబంధించి జిల్లాలు సాధిస్తున్న ప్రగతి ఆధారంగా సురక్షిత్,సక్షమ్,సంఘర్ష్‌శీల్ కేటగిరీలుగా వర్గీకరిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 జిల్లాలు సురక్షిత్, 12 జిల్లాలు సక్షమ్, ఒక జిల్లా సంఘర్ష్‌శీల్ స్థాయిలో ఉండగా, సురక్షిత్ హోదా సాధించిన 20 జిల్లాల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా కూడా చోటు సంపాదించింది.

95-95-95 లక్ష్యాలే ప్రధాన ప్రమాణం

హెచ్ ఐ వీతో జీవిస్తున్న వారిలో 95 శాతం మంది తమ హెచ్ ఐ వీ స్థితిని తెలుసుకోవడం, నిర్ధారణ అయిన వారిలో 95 శాతం మంది యాంటీ రెట్రోవైరల్ థెరపీ పొందడం, చికిత్స పొందుతున్న వారిలో 95 శాతం మంది వైరల్ సప్రెషన్ సాధించడం 95-95-95 కార్యక్రమ ప్రధాన లక్ష్యాలని అధికారులు వివరించారు. జిల్లాలో హెచ్ ఐ వీ పరీక్షలు, బాధితులను సకాలంలో గుర్తించడం, చికిత్సకు అనుసంధానం చేయడం, ఏ ఆర్ టీ సేవలు, నిరంతర ఫాలోఅప్, వైరల్ లోడ్ మానిటరింగ్ తదితర సేవలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ఈ పురోగతి సాధ్యమైందని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో రాష్ట్ర అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ సమావేశమై జిల్లాలో హెచ్ ఐ వీ/ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల అమలు, ఇప్పటివరకు సాధించిన ప్రగతి, సురక్షిత్ హోదా సాధనకు దోహదపడిన కార్యక్రమాలపై వివరించారు. సాధించిన పురోగతిని కొనసాగిస్తూ హెచ్ ఐ వీ నివారణ, పరీక్షలు, చికిత్స, ఫాలోఅప్ సేవలను మరింత పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు.

జిల్లా సురక్షిత్ హోదా సాధించడంలో జిల్లా యం త్రాంగం, వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమ అధికారులు, ఐ సీ టీ సీ/ ఏ ఆర్ టీ సంబంధిత సేవల సిబ్బంది, క్షేత్ర స్థాయి సిబ్బంది సమన్వయంతో చేసిన కృషి కీలకమని పేర్కొన్నారు. నాకో తాజా నేషనల్ స్కోర్ కార్డులో జాతీయ స్థాయిలో రాష్ట్రం 2వ స్థానాన్ని సాధించినట్లు సమ్మాన్ సమారోహ్ ప్రెస్ నోట్‌లో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు సురక్షిత్ స్థాయిని సాధించే దిశగా కార్యక్రమాల ను మరింత బలోపేతం చేయాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఏంజెల్ ఆల్బెడ్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాంరెడ్డి, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

నూతన చేయూత పెన్షన్ లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వుల అందజేత





- చేయూత పెన్షన్లతో పేదలకు భరోసా

జమ్మికుంట, నవంబర్ 17 (ప్రజా జ్యోతి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన చేయూత పెన్షన్లకు సంబంధించి జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు 583, జమ్మికుంట మండల పరిషత్ పరిధిలోని 20 గ్రామాలకు కలిపి మొత్తం 553 నూతన పెన్షన్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఈరోజు జమ్మికుంట లోని ఎంపీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన చేయూత నూతన పెన్షన్ల మంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమానికి హుజూరాబాద్ శాసనసభ్యులు శ్రీ పాడి కౌశిక్ రెడ్డి ముఖ్య అతిథిగా, హుజూరాబాద్ ఆర్డీవో జల కుమారి నాయక్ వాడి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు ఒక్కొక్క వార్డు నుంచి ఒక లబ్ధిదారుని చొప్పున మొత్తం 30 మందికి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి , ఆర్డీవో జల కుమారి నాయక్ వాడి, మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ,కమిషనర్ జి. మల్లికార్జున స్వామి చేతుల మీదుగా మంజూరు ఉత్తర్వులు అందజేశారు. అదేవిధంగా జమ్మికుంట మండల పరిషత్ పరిధిలోని 20 గ్రామాలకు ఒక్కొక్క గ్రామం నుంచి ఒక లబ్ధిదారుని చొప్పున 20 మందికి సంబంధిత గ్రామ సర్పంచులు, ఎంపీడీవో ఆర్. పద్మావతి ,ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి , ఆర్డీవో జల కుమారి నాయక్ వాడి గారి చేతుల మీదుగా మంజూరు ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన జమ్మికుంట మండలం లోని 20 గ్రామాల పెన్షన్ లబ్ధిదారులకు, మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డుల లబ్ధిదారులకు ఎంపీఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో అవసరమైన ఏర్పాట్లను ఎంపీడీవో ఆర్. పద్మావతి గారు, మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి సమన్వయంతో చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ ముంతాజ్ అలీ (జావిద్), వార్డు కౌన్సిలర్లు, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ఎంపీఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

భూ రీసర్వేను వెంటనే పూర్తి చేయాలి

- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



కాల్వ శ్రీరాంపూర్ నవంబర్ 17 (ప్రజా జ్యోతి) కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని. మంగపేట్. కిష్టంపేట్. గ్రామాల్లో నిర్వహిస్తున్న .భూముల రిసర్వేణు వెంటనే పూర్తి చేయాలని. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సిబ్బందికి సూచించారు. మంగపేట గ్రామంలో చేపడుతున్న సర్వే పనులు 90 శాతం వరకు పూర్తి అయిందని. కిష్టంపేట్ లో ఇంకా కొంత మిగిలిందని తహసిల్దార్ డాక్టర్ రాపల్లి రాముడు ఆయన దృష్టికి తీసుకెళ్లగా .వెంటనే సర్వేను పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. కిస్టంపేట్. మోట్లపల్లి గ్రామాల్లో గల .వరి కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈయన వెంట ఆర్ఐలు ఏ రాజేష్ వినోద్ సర్వేర్లు బండరాజు సంతోష్ జి పి ఓ లు .రాజు .స్వాతి. సర్పంచులు శ్రీనివాస్. తుల మనోహర్‌రావు .తదితరులు ఉన్నారు.

నూతన నియామకం



రామగిరి, నవంబర్ 17 (ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామగిరి మండలం సెంటినరీ కాలనీకి చెందిన బత్తుల రమేష్ నియమితులయ్యారు. జిల్లా వ్యాప్తంగా పెరిక కుల సంఘం కార్యకలాపాలను విస్తరించడం, సంఘాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు జిల్లా అధ్యక్షుడు దుండ మల్లేశం పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు గటిక విజయ్ కుమార్, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ఆమోదంతో మంగళవారం బత్తుల రమేష్ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సంఘ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, కులస్థులందరినీ సమన్వయం చేసుకుంటూ ఐక్యత, అభివృద్ధి కోసం పని చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నిజరూప దర్శనానికి ఆహ్వానం

- రాష్ట్ర గవర్నర్, ఉప ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రికలు అందించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం





మల్యాల,నవంబర్ 17, ప్రజా జ్యోతి: సుమారు గత 60 సంవత్సరాల క్రితం జరిగిన మహాకార్యాన్ని తిరిగి నిర్వహిస్తున్నామంటూ కొండగట్టు అంజనేయ స్వామి చందనోత్సవము,మహా సంప్రోక్షణ కార్యక్రమాలకు వచ్చి అంజనేయ స్వామి నిజరూప దర్శనాన్ని కన్నుల పండుగగా వీక్షించాలని రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల కు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదుగా మంగళవారం ఆహ్వాన పత్రిక అందించి,ఇట్టి కార్యక్రమానికి ఆహ్వానించారు. అలాగే తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క ను కలిసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇట్టి కార్యక్రమ విశిష్టతను వివరించారు. దాదాపుగా ఆరు దశాబ్దాల తర్వాత జరుగుతున్న ఈ కార్యక్రమానికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికతో పాటు స్వామివారి ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి సత్యంతో పాటు దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ధార్మిక అడ్వైజర్ గోవిందా హరి, ఆలయ కార్య నిర్వహణ అధికారి అంజనా రెడ్డి, ఆలయ పర్యవేక్షకులు సునీల్, వేద పారాయణదారులు, అర్చకులు పాల్గొన్నారు.

దేవుని గుట్ట తండాలో బాలల దినోత్సవం



ఎల్లారెడ్డిపేట నవంబర్ 17ప్రజా జ్యోతి ఎల్లారెడ్డిపేట మండలంలో దేవుని గుట్ట ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం రోజు చిల్డ్రన్స్ డే జరుపుకున్నారు విద్యార్థులు ఉపాధ్యాయులు అయిన వేళ చిన్నారులను వారి తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేశారు ఉపాధ్యాయులు రోజా అంజలి విద్యార్థులు విద్యార్థులు అంగన్వాడి ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

త్వరలోనే సింగరేణి పరిరక్షణ యాత్ర

- కార్మికుల సమస్యలపై అలుపెరుగని పోరాటం
- టిబిజికెస్ అధ్యక్షులు మిర్యాల





గోదావరిఖని, నవంబర్ 17 (ప్రజా జ్యోతి): గోదావరిఖని టిబిజికెస్ కేంద్ర కార్యాలయంలో కేంద్ర కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల వైఫల్యం కారణంగా సింగరేణి కార్మికులు అనేక హక్కులు కోల్పోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. వకార్మికులకు ఉత్పత్తికి కావలసిన కనీస పని ముట్లు, పరికారాలు,రక్షణ సామాగ్రిని కూడా అందించలేక పోవడంతో ఉత్పత్తి కుంటు పడుతుందని నిత్యం ప్రమాదాల పరంపర కొనసాగుతుందని, కొత్త హక్కులు దేవుడెరుగు ఉన్న హక్కులు ఒక్కొక్కటి పోతున్నాయని, సింగరేణికి నూతన బొగ్గు గనులు రాక పోవడం,ఉన్నగనులు మూతపడుతుండటం వలన సంస్థ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు.యాజమాన్యంతో పోరాడాల్సిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కేవలం పైరవీలకె పరిమితమై కార్మికులకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు.గుర్తింపు కాల పరిమితి పూర్తి అయిన కూడా చందాలకు అలవాటు పడిన ఏఐటీయూసీ ఎన్నకలంటేనే భయపడుతుందన్నారు. గుర్తింపు సంఘ నాయకులు ప్రీ మస్టర్లు పడుతూ కార్మికుల సమస్యల పై నోరెత్తడం లేదని మండిపడ్డారు. పోరాటాల ద్వారానే హక్కులు సాధించబడతాయి అని టిబిజికెస్ భావిస్తుందన్నారు.దీనిలో భాగంగా టిబిజికెస్ కార్మిక హక్కుల సాధనకు చెపట్టబోయె కార్యక్రమాలలో కార్మికుల అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ. సమావేశం పలు అంశాలు సమస్యలపై తీర్మాణాలు చేశారు.

తీర్మానాలు ...

సింగరేణికి జెన్కో,ట్రాన్స్ కో నుంచి రావలసిన రూ.60 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని,12వ వేజ్ బోర్డ్ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని,వేజ్ బోర్డు అగ్రిమెంట్ అయ్యె వరకు 40% ఐ ఆర్ కార్మికులకు చెల్లించాలి,వేలంతో సంబందం లేకుండా సింగరేణికి నేరుగా గనుల కేటాయింపు చేయాలి,సింగరేణిలోని హాస్పటల్ లలో నాణ్యమైన వైద్యం అందించాలని,కార్మికులకు ప్రభుత్వ హామి మేరకు 250 గజాల స్థలం కేటాయింపు చేయాలని,రూ.20 లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలని,2019 నుండి డిస్మస్ కార్మికులకులందరికి ఎలాంటి షరతులు లేకుండా తీసుకోవాలని,2026లో డిస్మస్ అయిన వారికి పరగణలోకి తీసుకోవాలని,మారుపేర్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని, వెయిటింగ్ లో ఉన్న 300 మంది డిపెండెంట్లకు వెంటనే నియామక పత్రాలివ్వాలని,సింగరేణిలో కొరత ఉన్న పనిముట్లు,స్పేర్స్ కొనుగోలు చేయాలని,ప్రతినెల మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి బోర్డ్ కి పెట్టుకున్న కార్మికులందరిని అన్ పిట్ చేయాలని,సింగరేణి కార్మిక వాడలలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని,క్వార్టర్ ల నిర్వహణ మెరుగుపర్చాలని,పెండింగ్ లో ఉన్నప్రమోషన్లు ఇంటర్నల్ క్లరికల్ తదితర పరిక్షలను వెంటనే నిర్వహించాలని తదితర అంశాలను తీర్మాణించారు.అనంతరం కేంద్ర కమిటి వివిధ ఎరియాలలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు.ఈ సమావేశంలో ప్రదాన కార్యదర్శులు కాపు క్రుష్ణకెతిరెడ్డి,సురెందర్ రెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి,సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమరయ్య,పర్లపల్లి రవి,మంగి లాల్, చెల్పూరి సతీష్,బడికెల సంపత్, ప్రభాకర్ రెడ్డి,వడ్డెపల్లి శంకర్,అయిలి శ్రీనివాస్,నాగెల్లి సాంబయ్య, బండిర మేష్,మల్రాజ్ శ్రీనివాసరావు మెడిపల్లి సంపత్, బడితెల సమ్మయ్య,గడప రాజయ్య, నాగెల్లి వెంకటేశ్వర్లు,తుమ్మ శ్రీనివాసరావు,జావిద్ పాషా,పొలాడి శ్రీనివాసరావు, ఇందూరి సత్యనారాయణ, ఐ.సత్యం,అవినాష్ రెడ్డి, అన్వేష్, రాజేశం, శేషగిరి, అన్ని ఎరియాల కేంద్ర కమిటి నాయకులు పాల్గొన్నారు.

బావుసాయిపేట వాగులో అక్రమ ఇసుక తవ్వకాలు

- రైతులకు తప్పని సాగు నీటి కష్టాలు!
- 500 మంది రైతుల జీవనాధారమైన వాగులో యథేచ్ఛగా ఇసుక తరలింపు – భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని అన్నదాతల ఆవేదన





కోనరావుపేట, నవంబర్.17(ప్రజా జ్యోతి) కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని రైతులకు సాగునీటి ఆధారంగా ఉన్న వాగులో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేపడుతూ, వందలాది టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ తవ్వకాల కారణంగా వాగు స్వరూపం మారిపోవడంతో పాటు భూగర్భ జలమట్టం గణనీయంగా పడిపోతోందని, వ్యవసాయ బావులు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని, భూగర్భ జలాల పరిరక్షణ కోసం కొత్త బోర్ల ఏర్పాటుపై ప్రభుత్వం ఆంక్షలు విధిస్తుండగా, మరోవైపు వాగులో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగడం రైతులను ఆందోళనకు గురిచేస్తోందని పేర్కొంటున్నారు. సుమారు 500 మంది రైతుల వ్యవసాయానికి జీవనాధారంగా ఉన్న ఈ వాగులో భారీ స్థాయిలో ఇసుకను తవ్వి తరలించడం వల్ల భవిష్యత్తులో సాగునీటి సమస్య మరింత తీవ్రతరం అయ్యే ప్రమాదం



ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఇసుక తవ్వకాల కారణంగా వాగు గుంతలమయంగా మారిందని, వాగులో నీటి నిల్వలు తగ్గడంతో పరిసర ప్రాంతాల్లోని భూగర్భ జలాలపై ప్రభావం పడుతోందని రైతులు చెబుతున్నారు. దీంతో వ్యవసాయ బావుల్లో నీరు తగ్గిపోవడం, పంటలకు సకాలంలో నీరు అందకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా వాగు ఒడ్డున ఉన్న వ్యవసాయ భూములు కోతకు గురవుతున్నాయని, ఇసుక తవ్వకాల ప్రభావంతో తమ పంట పొలాలకు నష్టం వాటిల్లుతోందని వాపోతున్నారు. వందలాది టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇసుక తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎంత పరిమాణంలో తవ్వకాలకు అనుమతి ఇచ్చారు? అనుమతులకు మించి తవ్వకాలు జరుగుతున్నాయా? అనే అంశాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు, మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ఇసుక తవ్వకాల పరిస్థితిని పరిశీలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. బావుసాయిపేట వాగులో ఇసుక తవ్వకాలను తక్షణమే నిలిపివేసి, అక్రమ తవ్వకాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైతుల జీవనాధారమైన వాగులను కాపాడి, భూగర్భ జలాలను పరిరక్షించేందుకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించకపోతే గ్రామ రైతులందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రైతులు మారుపాక రాములు, పుల్లూరి మల్లికార్జున్, చంద్రు నాయక్, గొల్లపల్లి వెంకట్రాజం గౌడ్, శ్రీనివాస్, యశోద శ్రీనివాస్, నక్క ఎల్లయ్య, ఉప సర్పంచ్ తిక్కల నవీన్, వార్డు సభ్యుడు కర్ణాల శ్రీనివాస్, తదితరులు కోరారు.

అంకుసాపూర్‌లో బాలామృతం ప్లస్ పై అవగాహన కార్యక్రమం

తంగళ్ళపల్లి, నవంబర్ 17:(ప్రజా జ్యోతి) తంగళ్ళపల్లి సెక్టార్ పరిధిలోని అంకుసాపూర్–1 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం 10 నిమిషాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిపిఓ వీరభద్రయ్య, ఎంపిడిఓ రమేష్, సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, సూపర్వైజర్ సౌజన్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, లబ్ధిదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లోప పోషణ ఉన్న పిల్లల తల్లిదండ్రులకు బాలామృతం ప్లస్ యొక్క విలువలను వివరించారు. ప్రతి నెల పిల్లల బరువు తప్పనిసరిగా తూయించాలని సూచించారు. పిల్లల జీవితంలో 6 సంవత్సరాల లోపు వయస్సు చాలా ముఖ్యమైనదని, ఈ సమయంలోనే మెదడు ఎదుగుదల ఎక్కువగా ఉంటుందని, కాబట్టి పిల్లలను చురుకుగా ఉంచాలని, అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

